Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 15.09.2017, శుక్రవారం   సంపుటి : 37 సంచిక : 15   పేజీలు : 12, వెల : ₹ 5


కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి   సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# 'సీమ'లపై ప్రత్యేక ప్రేమ

## టీడీపీ లక్ష్యం రాయలసీమ... వైసిపి టార్గెట్ కోనసీమ!



- ఒకరి కంచుకోటపై ఒకరి కన్ను
- ఓడిన స్థానాలపైనే అధిక శ్రద్ధ
- వంద స్థానాలకు మొదటి ప్రాధాన్యత



**రాజకీయాలలో పక్కా ప్లానింగ్, అంచనా, వాస్తవ దృష్టి, సమయస్ఫూర్తి, ప్రత్యర్థుల కోటల్లోకి సైతం జొరబడే తత్వం, ఆత్మపరిశీలన, స్థానిక పరిస్థితులపై అవగాహన... ఇన్ని వుంటేనే రాణించగలరు. ముఖ్యంగా గాలివాటాన్ని, సానుభూతిని, ప్రభంజనాలను నమ్ముకున్న వాళ్ళు ఎక్కువకాలం రాజకీయాలలో నిలువలేరు.**

చంద్రబాబు ఎన్టీఆర్‌లా ప్రజాకర్షణ వున్న నాయకుడో, వై.యస్.లా ప్రజాభిమానం సంపాధించుకున్న నాయకుడో కాదు. అయినా 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాడు. కారణం రాష్ట్ర రాజకీయాలపై ఆయనకున్న అవగాహన. సామాజిక సమీకరణలపై అతనికున్న విషయ పరిజ్ఞానం. రాష్ట్ర ప్రజల ఆలోచనా విధానాలపై అతనికున్న గురి. కాపుల ఓట్లకు రిజర్వేన్, పవన్‌ల గాలం, మహిళలు, రైతుల ఓట్లకు ఋణమాఫీ వల, విద్యార్థులు, ఉద్యోగార్థుల ఓట్లకు నిరుద్యోగ భృతి ఎర... ఇలా ఒక్కో వర్గాన్ని ఒక్కో రకంగా బుట్టలో పెట్టి కప్పేసాడు. 2014లో ఇచ్చిన (మిగతా 11వ పేజీలో)



## ఒకరు... ఇంటింటికి! మరొకరు... గడప గడపకు!

- జిల్లాలో మొదలైన రాజకీయ సెగ 11లో
- రెపరెపలాడుతున్న పార్టీల జెండాలు






కంచి పట్టు చీరలు
వీవర్స్ ధరలకే

కళానికేతన్®
షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677


# కాంగ్రెస్‌లోనే ఉంటారా?



> రాష్ట్ర రాజకీయ చరిత్రగర్భంలో కలిసిపోనున్న కాంగ్రెస్

**రాజకీయాలలో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవనేందుకు పెద్ద ఉదాహరణ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీకి పట్టిన దుస్థితి. కష్టకాలంలో కూడా కాంగ్రెస్‌పార్టీని ఆదుకున్న రాష్ట్రమిది. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పెట్టే ముందువరకు కూడా ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఎదురన్నది లేదు. కాంగ్రెస్‌ను, ఇందిరాగాంధీ కుటుంబాన్ని అంతగా ఆదరించారు ఆంధ్రులు. ఆదుకున్న ఆంధ్రులతోనే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆడుకుంది. దానికి తగిన మూల్యం చెల్లించుకుంది.**

ఈ దేశంలో పెద్ద రాష్ట్రాలలో కాంగ్రెస్ మట్టి కొట్టుకుపోయినా ఆంధ్రప్రదేశ్ అండగా నిలిచింది. 2004, 2009లలో కేంద్రంలో కాంగ్రెస్ రెండుసార్లు అధికారంలోకి వచ్చిందంటే అందుకు కారణం ఈ రాష్ట్రం నుండి మెజార్టీ లోక్‌సభ సీట్లు అందించడమే. అలాంటి రాష్ట్రంలో కాంగ్రెస్ చేజేతులా ఆత్మహత్య చేసుకుంది. రాష్ట్ర విభజన అనే కొమ్మకు తన ఉరితాడు తానే బిగించుకుంది. 2014 ఎన్నికల్లోనే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ బ్రతుకు, భవిష్యత్ ఏంటన్నది (మిగతా 11వ పేజీలో)



## కళలకు కానుకగా...

# టిఎస్సార్ పుట్టినరోజు వేడుక

- 16, 17 తేదీల్లో విశాఖకు ఆధ్యాత్మిక, 'కళా' కాంతులు
- విఖ్యాత సినీ నటీమణి జమునకు 'నవరస కళావని' పురస్కారం

'కళాబంధు', రాజ్యసభ సభ్యుడు, ఆధ్యాత్మికవేత్త..అందరికీ ఆత్మీయుడు టి.సుబ్బరామిరెడ్డి (టిఎస్సార్) జన్మదినోత్సవ వేడుకలు సెప్టెంబర్ 17వ తేదిన విశాఖలో ఎంతో ఘనంగా జరుగనున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను రెండురోజుల పాటు ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. అటు ఆధ్యాత్మిక రంగానికి, ఇటు కళారంగానికి టిఎస్సార్ చేస్తున్న నిరుపమానమైన సేవలు అందరికీ తెలిసినవే. అందుకే, ఈ సారి కూడా రెండురోజులు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో 16న ఆధ్యాత్మిక వేడుక, 17న కళావేదికలతో ఈ సంబరాలు ఎంతో శోభాయమానంగా జరుగనున్నాయి. ఆ రెండు రోజులు విశాఖ మరింతగా ఆధ్యాత్మిక-కళా కాంతులతో కళకళలాడనుంది. 16వ తేదిన విశాఖలోని 'ఉడాలి చిల్డ్రన్ థియేటర్‌లో ఆధ్యాత్మిక పండుగగా పలు విశిష్టమైన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేయనున్నారు. అదేవిధంగా, ముక్కామల క్షేత్రం పీఠాధిపతి పరమపూజ్య శ్రీ శ్రీధరస్వామీజీ, 'అభినవ పతంజలి' బిరుదాంకితులు పండిట్ శేషభట్టర్ సుదర్శనాచార్య విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. వీరితో పాటు అనేక మంది ఆధ్యాత్మిక వేత్తలు, దేశవ్యాప్త ఖ్యాతిగాంచిన ప్రముఖులు, సినీప్రముఖులు విచ్చేయనున్నారు. 17వ తేదీ టిఎస్సార్ జన్మదినం రోజున కళారంగానికే పండుగ అన్నట్లుగా ప్రఖ్యాత సినీప్రముఖులు, రాజకీయరంగ ప్రముఖులు తదితరులందరి సమక్షంలో టిఎస్ఆర్ జన్మదినోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరుగనున్నాయి. టి.సుబ్బరామిరెడ్డి లలితకళా పరిషత్



ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో విఖ్యాత సినీనటీమణి 'కళాభారతి' శ్రీమతి జమునకు టిఎస్ఆర్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఎంతో ప్రతిష్టాత్మకమైన 'నవరస కళావని' పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ వేడుక విశాఖలోని కళావని ఆడిటోరియంలో నేత్రపర్వంగా జరుగనుంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, పద్మభూషణ్ డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితర ప్రముఖులెందరో ఈ వేడుకలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 17వ తేది మధ్యాహ్నం 4.30 గంటలకు వివిధ మతాధిపతులతో 'సర్వధర్మ సమభావన సమ్మేళనం' జరుగుతుందని టిఎస్సార్ లలితకళా సమితి నిర్వాహకులు పేర్కొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన ఏపిఎస్పీడిసి ఎం.డి



ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ సంస్థ ఎం.డి ఎం.నాయక్ ఈ నెల 10న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. పారిశ్రామికంగా శ్రీసిటీ సాధించిన ప్రగతిని ఆయనకు వివరించారు. ఆ తర్వాత అధికారులతో జరిగిన సమావేశంలో పారిశ్రామిక సంస్థల ప్రస్తుత, భవిష్యత్ విద్యుత్ అవసరాలను తెలుసుకుని, ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ సరఫరాను సమీక్షించారు. వివిధ ప్రదేశాల్లో నెలకొల్పిన విద్యుత్ సబ్‌స్టేషన్లను, ఇతర విద్యుత్ సరఫరాకు సంబంధించిన మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు హామీ ఇస్తూ, అధునాతన మైన స్కడా సిస్టమ్ ఆధారిత వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పర్యటనలో విద్యుత్ సంస్థ చీఫ్ ఇంజనీర్ నందకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ హరనాధ్ తదితరులు పాల్గొన్నారు.






## ఆభరణాల డిజైనింగ్‌లో

# నెల్లూరుయువతి ప్రతిభ



ఈ నెల 12వ తేదీన చైనాలోని షెన్‌జన్ నగరంలో జరిగిన అంతర్జాతీయ గోల్డ్ వెడ్డింగ్ జ్యూయెలరీ డిజైన్ పోటీలలో నెల్లూరుకు చెందిన కరిష్మా ఎస్ జైన్ అద్భుత ప్రతిభ చూపి తృతీయ బహుమతి సాధించింది. ఆసియా దేశాల నుండి రెండువేల మంది డిజైనర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆమె రూపొందించిన వివాహ ఆభరణాల డిజైన్‌లు ఈ పోటీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నెల్లూరులోని ఎస్‌పి గోల్డ్ జ్యూలరీ అధినేత చందూలాల్ ఎస్ రమణి మనుమరాలే ఈ కరిష్మా. గతంలోనూ బంగారు ఆభరణాల డిజైన్‌లకు సంబంధించి పలు పోటీలలో పాల్గొని బహుమతులందుకుంది.



సింహపురి సమాచారం

## దండాలమ్మా!..


# పోలేరమ్మా!..

## వెంకటగిరి జాతరకు పోటెత్తిన భక్తజనం



వెంకటగిరి జాతరకు జనం పోటెత్తారు. వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లికి అడుగడు గునా దండాలు పెడుతూ, అమ్మవారి నామస్మరణలు చేసుకుంటూ తండోప తండాలుగా భక్తజనం తరలిరావడంతో వెంకటగిరి క్రిక్కిరిసిపోయింది. భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి అయిన వెంకటగిరి పోలేరమ్మను తలచుకుంటూ లక్షలాదిగా ప్రజలు ఈ జాతరకు తరలిరావడం విశేషం. జాతర రోజుల్లో అమ్మవారిని దర్శించుకుంటే శుభం కలుగుతుందని, తమ జీవితాలకు ఎలాంటి కష్టాలు ఉండవని భక్తుల అపారనమ్మకం. దీంతో, జాతరకు విచ్చేసే భక్తజనం సంఖ్య ప్రతిఏటా పెరుగుతూనే ఉంది. కుటుంబాలకు కుటుంబాలే అమ్మవారి జాతరకు కదలిరావడంతో వెంకటగిరి భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి జాతర బుధవారం ప్రారంభమైంది. రాత్రి 11గంటల ప్రాంతంలో అమ్మవారిని మెట్టినిల్లయిన జీనిగలవారివీధిలోని ఇంటికి తీసుకువచ్చాక వేలసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జీనిగలవారివీధిలో అమ్మవారిని నిలుపుదల చేసిన అనంతరం గాలిగంగుల పూజా కార్యక్రమాలను ఎంతో వేడుకగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వైభవంగా ఊరేగించారు. గురువారం రాత్రి అమ్మవారి జాతర మరెంతో అంగరంగవైభవంగా జరిగింది. అమ్మవారి ఊరేగింపుకు జనం ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చారు. ఈ జాతరకు వెంకటగిరి, ఆ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తజనం పెద్దసంఖ్యలో తరలిరావడంతో వెంకటగిరి అంతా భక్తజనప్రవాహంతో నిండిపోయింది. ఎంతెంతో దూరం నుంచి వచ్చిన భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం అమ్మవారి జాతర కావడంతో పట్టణంలోని వీధులన్నీ జన సమూహాలతో నిండిపోయాయి. ఎక్కడ చూసినా జాతర కోలాహలమే. వెంకటగిరి ప్రజలు అమ్మవారి ప్రతిరూపంగా పూజలందుకునే వేపమండలతో ఇళ్లను అలంకరించుకున్నారు. నట్టింట్లో అమ్మవారి ప్రతిమను ఏర్పాటుచేసుకుని పూజలు చేసుకున్నారు. అమ్మవారి ప్రసాదంగా అంబలి సిద్ధం చేశారు. తప్పెట్లు తాళాలతో, మంగళవాయిద్యాలతో వెంకటగిరి మార్మోగింది. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారి ఊరేగింపు కన్నులపండువగా సాగింది. ఈ ఊరేగింపులో లక్షలాదిగా జనం పాల్గొని అమ్మవారిని కన్నులారా దర్శించుకుని తరించారు. జాతర సందర్భంగా పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద ఈసారి అమ్మవారి నిలుపు మండపాన్ని ఏర్పాటుచేశారు. తొలుత, గురువారం ఉదయం సంప్రదాయబద్ధంగా వెంకటగిరి రాజాల వంశీయులు అమ్మవారికి సారె, గజ పూలమాల, పసుపుకుంకుమలు, గాజులు సమర్పించారు. రాజాలు తాంబూలం తీసుకుని జాతరను ప్రారంభించారు. అదేవిధంగా, టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఛైర్మెన్ పోలూరు రాజ్‌కుమార్ అమ్మవారికి సంప్రదాయబద్ధంగా టిటిడి నుంచి సారెను తీసుకువచ్చి సమర్పించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి సారెను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద, బిజెపి నాయకులు భాస్కర్, ఏఎంసి ఛైర్మెన్ పులుకొల్లు రాజేశ్వరరావుతో పాటు స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు వాత్సల్య పిల్లలు



తిరుపతి పట్టణంలో ఈనెల 9, 10, 11తేదీలలో మూడురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో నెల్లూరు కొండాయపాలెంరోడ్డులోని జనహిత-వాత్సల్య పిల్లలు డి.పూజిత(అండర్-11), సి.హెచ్.శ్రీకర్(అండర్-14)లు తృతీయ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విజేతలకు చిత్తూరు ఎంపి ఎన్.శివప్రసాద్ బహుమతులందజేశారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించిన చిన్నారులు బి.పూజిత, సి.హెచ్.శ్రీకర్‌లను జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి సత్కరించి బహుమతులందజేశారు. ప్రముఖ యోగా గురువు ముప్పిరాల నరశింహాశాస్త్రి పిల్లలు సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లు, ప్రైజ్‌లను అందజేశారు. జనహిత-వాత్సల్య సంఘటన కార్యదర్శి జి.వి.సాంబశివరావు, వాత్సల్య జాయింట్ సెక్రటరి టివియస్ దుర్గాప్రసాద్, హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఎం.మధుసూదన్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ గుత్తికొండ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# N.B.K.R. INSTITUTE OF SCIENCE & TECHNOLOGY

## (AUTONOMOUS)

Vidyanagar, SPSR Nellore Dt.

అత్యంత ప్రతిష్టాత్మకమైన

**Meidensha Corporation(Tokyo),**

**Prime Meiden Limited తో**

జపాన్ సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్య బదలాయింపు కొరకు

తేది 14.9.2017న అవగాహన ఒప్పందం(MOU) కుదిరింది.

ఈ ఒప్పందంతో జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో
**NBKR IST** ముందు ఉండడం జిల్లాకే గర్వకారణం.
భవిష్యత్తుల్లో మరెన్నో ప్రముఖ దేశ, విదేశీ మరియు బహుళజాతి సంస్థలతో
**Training & Placement, Centre of Excellence,**
**Research & Development, Incubation Centre** వంటి
విద్యార్థులకు ఉపయోగపడే వినూత్న కార్యక్రమాలు చేపడతామని తెలియజేస్తూ...



Headquarters in Tokyo



**Nedurumalli Ramkumar**
Correspondent



## 'ప్రభా'తం

# విషమించిన విద్వేషపు జ్వాలలు

**మయన్మార్‌లో జాతి విద్వేషాలు ప్రబలి హింసాకాండలు ప్రజ్వరిల్లు తున్నాయి. మైనార్టీలైన రోహింగ్యాల జీవనం అస్తవ్యస్తమైంది. ప్రాణభయంతో వారు ఇతరదేశాలకు వలసవెళ్తున్నారు. జాతుల మధ్య విద్వేషాలు పెచ్చరిల్లితే పరిస్థితి ఎంత దారుణంగా, దయనీయంగా ఉంటుందో..మయన్మార్ ఒక తాజా ఉదాహరణ. వెంటనే ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థలు, మన దేశంతో సహా అన్నిదేశాలూ మానవతా హృదయంతో మయన్మార్‌లో శాంతిని నెలకొల్పాలి. ఆ విద్వేషాల మంటలను వెంటనే చల్లార్చాలి.**

మయన్మార్... ఇప్పుడొక పెద్ద సమస్య. ప్రపంచాన్నే కుదిపేస్తున్న జటిల సమస్య. జాతి విద్వేషాలు పరాకాష్టకు చేరుకుంటే అక్కడ ఎంతటి విధ్వంసాలైనా జరుగుతాయని, చివరికి సామాన్య ప్రజలు తలదాచుకునేందుకు చోటు దొరకడం కూడా ఎంతో కష్టమవుతుందని చెప్పేందుకు..మయన్మార్ ఒక తాజా ఉదాహరణ. ఒకరిపట్ల ఒకరిపై విశ్వాసం, పరమత సహనం, శాంతి సామరస్యాలతో సహజీవనం వంటి మానవీయ భావనలు లోపిస్తే పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో తెలుసుకునేందుకు.. మయన్మార్‌లోని రోహింగ్యా ముస్లిమ్‌లు ఇప్పుడెదుర్కొంటున్న విషమస్థితి మానవాళికంతటికీ ఒక గుణపాఠమనే చెప్పవచ్చు. మయన్మార్‌లోని రఖైన్ జిల్లాలో ఇప్పుడు కాదు..ఎన్నో ఏళ్ళ నుంచి జాతివిద్వేషం రావణకాష్టంలా రగుల్కొంటూనే ఉంది. గత కొద్దిసంవత్సరాలుగా ఆ హింసాకాండలు మరింతగా ప్రజ్వరిల్లుతూనే ఉన్నాయి. దీంతో, రఖైన్ జిల్లాలోని రోహింగ్యా ముస్లిమ్‌ల సమస్య మరింత జటిలంగా మారింది. వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న అతివాదసంస్థలు, మయన్మార్ భద్రతాబలగాల మధ్య జరుగుతున్న దాడులు అక్కడ జీవిస్తున్న సామాన్య పౌరులకు ప్రాణసంకటమై కూర్చుంది. ఎక్కడ చూసినా హింసాజ్వాలలు కమ్ముకుంటుండడంతో రోహింగ్యా ముస్లిమ్‌ప్రజలు తరతరాలుగా తాము నివసిస్తున్న ఆ దేశాన్ని వదిలిపెట్టి ప్రాణాలు దక్కించు కునేందుకు ఇతర దేశాలకు శరణార్థులుగా తరలి వెళ్తున్నారు. జాతి విద్వేషాలు రగుల్కొని..అంతటా హింసాకాండలు పెచ్చరిల్లుతుంటే, ఆ దాడులకు తట్టుకోలేక రఖైన్‌లోని సామాన్య ప్రజలు..ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు కన్నీళ్ళతో..కట్టుబట్టలతో ప్రాణాలు అరచేత పట్టుకుని ఆశ్రయం కోసం ఇతర దేశాల్లో తలదాచుకునేందుకు కదిలివెళ్తున్న దృశ్యాలు శాంతికాముకుల హృదయాల్ని ద్రవింపజేస్తున్నాయి. అక్కడ జాతి విద్వేషాలు సమసిపోయేదెప్పుడని అందరూ వేయికళ్ళతో ఎదురుచూస్తూనే ఉన్నారు. మయన్మార్‌లో ఇంతటి సంక్షోభానికి కారణం..అక్కడ జాతుల విద్వేషం రగుల్కోవడమే. శతాబ్దాల తరబడిగా మయన్మార్‌లో రోహింగ్యా ముస్లిమ్‌లు నివసిస్తున్నారు. ఆ ప్రాంతంలో వీరు స్వల్పసంఖ్యలో ఉన్న మైనార్టీలు. ఎన్నో ఏళ్ళుగా వారు ఇక్కడ నివసిస్తుండడంతో వారు మయన్మార్‌ను తమ సొంతదేశంగా భావిస్తున్నా, మయన్మార్ వైఖరితో వీరు తమకంటూ ఒక దేశం లేనివాళ్ళయ్యారు. ఆంగ్లేయులు భారతదేశాన్ని, బర్మా (ఇప్పటి మయన్మార్)ను వదిలిపోయిన తరుణంలో కూడా రోహింగ్యా ముస్లిమ్‌లు తాము ఉంటున్న రఖైన్ రాష్ట్రాన్ని తూర్పుపాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లో విలీనం చేయాలని కోరినా, ఆ ప్రయత్నాలు ఫలించలేదు. సరికదా వారి అవస్థలు మరింతగా పెరిగాయి. మయన్మార్‌లో అత్యధికంగా ఉన్న మెజార్టీవర్గీయులు బౌద్ధులు. రోహింగ్యాలు ముస్లిమ్‌లు కావడంతో ఒకరిపట్ల ఒకరికి అపనమ్మకం ఏర్పడేందుకు కారణమైందని, అందువల్ల ఇరువర్గాల మధ్య జాతివిద్వేషాలు ప్రారంభమయ్యాయని భావిస్తున్నారు. కాలక్రమంలో రోహింగ్యాలకు చివరికి పౌరసత్వం కానీ, ఓటు హక్కు కానీ లేకపోవడంతో రోహింగ్యాల్లో కొందరు ఆగ్రహావేశాలతో మిలిటెంట్‌బాట పట్టడం, దీంతో ఉద్రిక్తతలు పెరగడం, ఘర్షణలు చెలరేగడం గత కొన్నేళ్ళుగా జరుగుతూనే ఉన్నాయి. రోహింగ్యాలకు, మయన్మార్ సైనిక బలగాలకు మధ్య ఘర్షణలు చెలరేగుతూనే ఉన్నాయి. మిలిటెంట్‌లు ఇటీవల మయన్మార్ పోలీస్ పోస్టులపై దాడులు చేయడంతో హింసాకాండలు మరింతగా పెరిగాయి. దీంతో మొత్తంగా రోహింగ్యాలను తమ భూభాగంలో లేకుండా చేసే తలంపుతో మయన్మార్ ప్రభుత్వం దాడులు పెంచుతోందంటూ ప్రపంచవ్యాప్తంగా ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. అంతర్జాతీయస్థాయిలో ఎంతగా వత్తిడి వస్తున్నప్పటికీ మయన్మార్ ప్రభుత్వం మాత్రం వారిని కరుణించకపోవడం, పొరుగు దేశమైన బంగ్లాదేశ్ ఆ శరణార్థులకు తాత్కాలిక వసతి కల్పించడం మినహా ఏమిచేయలేమని చెప్తుండడంతో రోహింగ్యాల పరిస్థితి దయనీయంగా మారింది. రఖైన్‌లోని సామాన్య రోహింగ్యా ప్రజలు ప్రాణభయంతో ఇతర దేశాలకు శరణార్థులుగా వెళ్తూనేఉన్నారు. మయన్మార్‌లో రోహింగ్యాల పరిస్థితిని గుర్తించిన ఐక్యరాజ్యసమితి, ఇది అతిపెద్ద మానవహక్కుల సంక్షోభంగా అభివర్ణిస్తోంది. మరోవైపు, ఈ తాజా ఘర్షణల నేపథ్యంలో ఇటీవలనే సుమారు 90వేల మందికి పైగానే శరణార్థులు బంగ్లాదేశ్‌కు వెళ్ళినట్లు అంచనా. ఈ జాతి విద్వేషాల ఘర్షణల్లో ఇప్పటికే లక్షల సంఖ్యలో రోహింగ్యాలు బ్రతుకుజీవుడా అంటూ ఇతరదేశాలకు వెళ్ళిపోయారని సమాచారం. అయినా, నేటి ఆధునిక ప్రపంచంలో ఇంకా ఇలాంటి జాతివిద్వేషాలు రగుల్కోవడం ఎంతైనా బాధాకరం. ఎక్కడైనా సరే.. ఒక మనిషిని మరో మనిషి, ఒక జాతిని మరో జాతి.. పట్టి పీడించే విషసంస్కృతి ఉండకూడదు. అలాంటి విద్వేషాలు సమసిపోవాల్సిందే. ప్రపంచం అత్యంతాధునిక విజ్ఞానంతో శరవేగంగా పయనిస్తున్న వేళ.. ఇంకా ఇలాంటి విద్వేషాలు.. ఎంతైనా విచారకరం. ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థలు కదిలితే తప్ప ఇలాంటి జటిలమైన విషయాలు ఒక కొలిక్కిరావు. మయన్మార్‌లో రెండువర్గాలవారిని శాంతింపజేసి, జాతి విద్వేషపు మంటలను వెంటనే చల్లార్చాల్సివుంది. ప్రజలంతా శాంతి సామరస్యాలతో, సహజీవన సౌభాగ్యంతో జీవించేలా చేయడం అంతర్జాతీయసంస్థల తక్షణ కర్తవ్యం. తగు చర్చలు చేసి ఇరువర్గాలమధ్య సయోధ్య సాధించాలి. మయన్మార్‌లో శాంతి స్థాపన జరగాలి. అందుకు మనదేశంతో సహా అన్నిదేశాలు తోడ్పాటునందించాలి.

ఏదేమైనా, మనిషి...మానవీయ పతాకగా నిలవాలి. ప్రతి మానవుడు సకలమానవాళి క్షేమానికి.. అభ్యుదయానికి ప్రతీకగా మారాలి. సాటి మనిషి కంటనీరు తుడిచి ఆదుకోవాలి. మానవుడు.. మహోన్నతుడయ్యేది అప్పుడే. అలా జరిగినప్పుడే ఇలాంటి ద్వేషభావనలన్నీ సమసిపోతాయి. ఆ రోజు త్వరలోనే రావాలి. కులమేదైనా, మతమేదైనా, ప్రాంతమేదైనా, భాషేదైనా, జాతేదైనా..మనుషులంతా ఒకటేనని, అందరి కష్టాలు-కన్నీళ్లు ఒకటేనని గ్రహించాలి. మొత్తంగా మనమంతా మానవజాతేనని గ్రహించి మానవుడు...మానవీయమూర్తిగా ఎదగాలి. అప్పుడే మానవుడు...మహనీయుడవుతాడు!..

# సమాజాన్ని ముందుకు నడిపించేది.. సాహిత్యమే

### - పాతూరి మాణిక్యమ్మ అవార్డు సభలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి



సమాజాన్ని అభ్యుదయపథంలో ముందుకు నడిపించేది సాహిత్యమేనని, సాహిత్యాన్ని, రచయితలను అందరూ ఆదరించి ప్రోత్సహించాల్సి ఉందని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి(జూ) స్మారక భవనంలో ఈ నెల 10వ తేదిన జరిగిన పాతూరి మాణిక్యమ్మ స్మారక జాతీయస్థాయి సాహిత్య పురస్కార సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, పురస్కారగ్రహీత అయిన ప్రముఖ కవి బిక్కి కృష్ణ (హైదరాబాద్)కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన కవులకు పురస్కారాలు అందజేస్తూ రచనా రంగంలో వారికి ప్రోత్సాహం అందిస్తున్న ప్రముఖ రచయిత్రి పాతూరి అన్నపూర్ణను అభినందించారు. ఆమె తన మాతృమూర్తి పేరుతో ఈ అవార్డును అందజేయడం అభినందనీయమన్నారు. ఈ పురస్కార సభకు నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. అవార్డు గ్రహీత, బిక్కి కృష్ణ మాట్లాడుతూ, నెల్లూరంటే తనకెంతో అభిమానమని, సేవాభావం, ప్రేమతత్వం కలగలిసిన ప్రాంతం నెల్లూరని కొనియాడారు. ఈ అవార్డు రావడం తనకు సంతోషం కలిగించిందన్నారు. అనంతరం, సాహిత్యరంగంలో విశిష్ట కృషి చేస్తున్న ప్రముఖులు తాటికోల పద్మావతి(గుంటూరు), కె.విల్సన్‌రావు(హైదరాబాద్), ఎన్‌వి రఘువీరప్రతాప్(హైదరాబాద్), తేళ్ళ అరుణ (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు), ఇంద్రగంటి మధుసూదన్ (నెల్లూరు), గజల్ నాగరాజారావు (నెల్లూరు)లకు కీర్తిపురస్కారాలను అందజేశారు.

తొలుత 'మాతృదేవో భవ' అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ స్రవంతి 'రాయలసీమ రత్నాలసీమ' అంటూ గానం చేసి అందరి కరతాళ ధ్వనులందుకున్నారు. సమాచార పౌరసంబంధశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లాల్‌జాన్, కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షుడు బొగ్గవరపు మాల్యాద్రి (బెంగుళూరు), ప్రముఖ రచయిత సాగర్ శ్రీరామకవచం (ఒంగోలు), ఈతకోట సుబ్బారావు, డాక్టర్ ఏకుల హిమదేవి తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.




# న్యాయవాద వృత్తికి కళంకం

వైద్య వృత్తి తరువాత న్యాయవాద వృత్తి సమాజంలో గుర్తింపబడిన వృత్తిగా భావించబడుతుంది. గతంలో న్యాయవాదులు ధనాపేక్ష లేక చాలా నిజాయితీగా కేసులను వాదించి తమ క్లయింట్‌లకు న్యాయం అందించేవారు. చాలామంది న్యాయవాదులు నీతికి, నిజాయితీకి కట్టుబడి, తమ జీవితంలో చివరకు బీదరికం కూడా అనుభవించి వున్నారు. కాని, ప్రస్తుతం కాలంలో ఈ వృత్తిలో నిజాయితీ తీవ్రంగా లోపించింది. కొంతమంది న్యాయవాదులు తమ క్లయింట్లకు సరైన న్యాయం చేయటం లేదు. తమ క్లయింట్లకు తెలియకుండా రహస్య ఒప్పందం కుదుర్చుకొని కొన్ని కేసులను నీరుగార్చటమే కాక, వాయిదాలకు సరిగా హాజరుకాక, తీర్పు సమయంలో కూడా తప్పించుకుని అన్యాయం చేస్తున్నారు. తర్వాత క్లయింట్లకు వాస్తవం తెలిసినా ఏమీ చేయలేక బాధపడుతుంటారు. ఇక న్యాయమూర్తుల విషయానికి వస్తే, చాలామంది న్యాయమూర్తులు సంవత్సరాల తరబడి వాయిదాలు వేస్తూ, తమ వృత్తికి న్యాయం చేయలేకున్నారు. కొందరు న్యాయమూర్తులు కులం ఉచ్చులో పడి అన్యాయాలను కూడా న్యాయాలుగా తేలుస్తున్నారు.

*- ఓ బాధితుడు.*

# జిఎస్టీతో అస్తవ్యస్థం

నరేంద్ర మోడీ ప్రధాని అయితే దేశం తలరాత మారుతుందనుకున్నారు గాని, ఇలా వ్యాపారుల బ్రతుకులు తలక్రిందులవుతాయనుకోలేదు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జిఎస్టీతో వ్యాపార సంస్థలు అతలాకుతలమవుతున్నాయి. వ్యాపారం చేసేదాని కంటే వ్యాపారం చేయకపోవడమే మేలన్నట్లుగా జిఎస్టీ పన్నులున్నాయి. అసలే నోట్ల రద్దుతో కుదేలైపోయిన ఆర్థిక వ్యవస్థపై జిఎస్టీ గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది. జిఎస్టీ స్లాబులను ఇదే తీరులో అమలుచేస్తే అన్ని వ్యాపారవర్గాలు దెబ్బతినడం ఖాయం. జిఎస్టీలో విధిస్తున్న పన్నుల శాతంపై పునఃసమీక్షించాల్సివుంది.

*కె.తిరుమలరావు, నెల్లూరు.*

# మితిమీరిన భావస్వేచ్ఛ

ఎక్కడకూడా అతి అన్నది పనికిరాదని పెద్దలు చెబుతారు. మితిమీరిన భావప్రకటనా స్వేచ్ఛ కూడా ఇలాంటిదే! బెంగుళూరులో జర్నలిస్ట్ గౌరీలంకేష్ దారుణహత్యను అందరూ ఖండించాల్సిందే! సమాజంలో తలెత్తుతున్న సమస్యలకు చర్చలు, వాదనలు పరిష్కారం కావాలేగాని హత్యలు కాదు. గౌరీలంకేష్‌ను ఏ కోణంలో చంపారన్నది ఇంకా వెల్లడికాలేదు. అయినా ఆమె హత్యను హిందూత్వ వాదుల పైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. భావప్రకటనా స్వేచ్ఛను ఎంతగా దుర్వినియోగం చేస్తున్నారన్నది సోషల్ మీడియాలో గౌరీలంకేష్ పెట్టిన పోస్ట్‌లను చూస్తుంటే అర్థమవుతుంది. ఇంకో వర్గాన్ని రెచ్చగొట్టే విధంగానూ, కించపరిచే విధంగానూ మన భావజాలం ఉండరాదు. కేవలం అవతలివారి సిద్ధాంతాలను, వాదనలను చర్చల ద్వారా ఎదుర్కోవాలేగాని అతిమాటల ద్వారా కాదు.

*సి.రాజీవి, నెల్లూరు.*

## 'దేశం'ను వెంటాడుతున్న...

# గెలుపుగుర్రాల కొరత

నంద్యాల, కాకినాడలలో గెలుపుతో తెలుగుదేశం వర్గాల్లో ఉత్సాహం ఉరకలెత్తుతున్నా నెల్లూరుజిల్లా తెలుగు దేశం పార్టీలో మాత్రం గెలుపుగుర్రాల కొరత ఆ పార్టీని వెంటాడుతోంది. వైసిపికి బలమైన జిల్లా ఇది. వైకాపాను ధీటుగా ఎదుర్కోవాలంటే గెలుపుగుర్రాల ఎంపికపై పెద్ద ఎత్తునే కసరత్తు చేయాల్సివుంది.

2014 ఎన్నికల్లో సరిగా సీట్లు సాధించలేదని చెప్పి చంద్రబాబు దాదాపు రెండేళ్ళ పాటు ఈ జిల్లాను చిన్నచూపు చూసాడు. అభివృద్ధి విషయంలో సవతి తల్లి ప్రేమను చూపాడు. ఏడాది కాలంగా జిల్లా విషయంలో ఆయన మనసు కొంచెం మారింది. జిల్లా నుండి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డికి రెండో మంత్రి పదవిని ఇవ్వడంతో పాటు ఈ జిల్లా పట్ల తనకున్న విద్వేషాన్ని కొంచెం పక్కనపెట్టాడు.

మెజార్టీ సీట్లు తెచ్చుకోలేక పరువు పోగొట్టుకున్నామని, చంద్రబాబు దృష్టిలో చులకనైపోయామని, ఈసారైనా జిల్లాలో పార్టీకి మెజార్టీ సీట్లు తెచ్చి చంద్రబాబు చేత భుజాలు తట్టించుకోవాలనే తపనతో జిల్లా తెలుగుదేశం నాయకులున్నారు. పార్టీ అధికారం కోల్పోతే ఈ జిల్లాలో సీట్లు ఎక్కువొచ్చినా, తక్కువొచ్చినా చంద్రబాబు పట్టించుకోడు. ఎందుకంటే అది ప్రభుత్వ వ్యతిరేక ఖాతాలోకి పోతుంది. పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చి ఈ జిల్లాలో సీట్లు తక్కువ వస్తే మాత్రం అది జిల్లా నాయకుల అసమర్ధత అవుతుంది. వైకాపాకన్నా ఒక్కసీటు ఎక్కువ తెచ్చుకున్నా చంద్రబాబు వద్ద తలెత్తుకోగలరు.

ఈ దృష్టితోనే ముందుగా ఆయా నియోజకవర్గాలకు ఎవరైతే కరెక్ట్‌గా సరి పోతారన్న దానిపై ఇప్పటినుండే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో



ఫలానా సీటు ఈ పార్టీ గెలుస్తుంది అని చెప్పడానికి ఒకటి, రెండు సీట్లన్నా గ్యారం టీగా వుండేవి. జిల్లాలో ఇప్పుడు అలాంటి సీన్ లేకుండా పోయింది. జిల్లాలో 10 అసెంబ్లీలుంటే ఫలానా సీటులో తెలుగు దేశం ఘంటాపథంగా గెలుస్తుందని చెప్ప గల పరిస్థితి లేదు. జిల్లాలో ప్రస్తుతం తెలుగుదేశంకు ఆశాజనకంగా వున్న సీటు సర్వేపల్లి. అది కూడా ఈమధ్య మంత్రి సోమిరెడ్డి వ్యక్తిగతంగా కష్టపడుతుండబట్టి. ఆయన పోటీ చేస్తే తెలుగుదేశంకు కొంత అనుకూలమే. కాకపోతే ఆయన ఎమ్మెల్సీగా వున్నాడు. ఎన్నికలప్పటికి ఆయన పదవీ కాలం మరో మూడేళ్లదాకా ఉంటుంది. కాబట్టి ఆయన పోటీ చేస్తాడా? లేదా అన్నది సందేహం. ఆత్మకూరుకు ఆనం రామనారాయణరెడ్డి రూపంలో గట్టి అభ్యర్థి దొరికాడు. కాకపోతే ఆయన వచ్చాక కూడా అనుకున్నంతగా వర్గాన్ని పునరేకీకరణ చేయలేకపోయాడు. వైకాపా వైపు వెళ్ళిన ఆయన మనుషులందరు కూడా దాదాపు అక్కడే వున్నారు. ఇక తెలుగుదేశంలోనే గూటూరు కన్నబాబు అసమ్మతి వర్గాన్ని ఏర్పాటు చేసుకుని వున్నాడు. ఆనంకు సీటిస్తే ఆయనకు వ్యతిరేకంగా పనిచేయ డానికి ఇతను రెడీగా వున్నాడు. ఆత్మకూరు లోనూ 'దేశం'కు ఏమంతా ఆశాజనకంగా లేదు. నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, సూళ్లూరుపేటలలో టీడీపీకి కొత్త అభ్యర్థుల అవసరం వుంది. సూళ్లూరుపేటలో వైసిపి ఎమ్మెల్యే సంజీవయ్యకు ధీటైన అభ్యర్థి టీడీపీకి కొరతగా వుంది. నెల్లూరు నగరం, రూరల్‌లలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పి.నారా యణ, బీద రవిచంద్ర వంటి నాయకులు దిగితే తప్ప ఇక్కడున్న వైసిపి ఎమ్మెల్యేలను ధీటుగా ఢీకొట్టే పరిస్థితి లేదు. గూడూరుకు సిటింగ్ ఎమ్మెల్యే అని సునీల్‌ను నిలబెట్టినా కష్టమే! కావలిలో బీద మస్తాన్‌రావు తిరిగి పోటీచేయొచ్చు. ఉదయగిరి, వెంకటగిరి లలో సిటింగ్ ఎమ్మెల్యేలను మార్చుకోవా ల్సిన పరిస్థితి వుంది. అయితే వీరిని పక్కన పెడితే ఇంతకంటే బెటర్ అభ్యర్థులు కని పించడం లేదు. కోవూరులోనూ సిటింగ్ ఎమ్మెల్యేను కొనసాగిస్తారా? అక్కడా మార్పు గురించి ఆలోచిస్తారా? అన్నది చూడాలి.

## తప్పెవరిది?



నెల్లూరుజిల్లా డిఇఓగా మువ్వా రామలింగం వస్తున్నాడని తెలిసి జిల్లాలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. మాకీ డిఇఓ వద్దంటూ ఉపాధ్యాయులు నెత్తి నోరు బాదుకుని చెప్పారు. 'పోకిరి' సినిమాలో మహేష్‌బాబు పోలీసు ఆఫీసర్ అని తెలిసాక అతని ట్రాక్‌రికార్డు గురించి చెబుతారు. అట్లాగే మువ్వా రామలింగంకు కూడా పనిచేసిన ప్రతిచోటా ఒక ట్రాక్‌రికార్డు వుంది. ఏ జిల్లాలో పనిచేసినా వివాదాలే... అవినీతి ఆరోపణలే! అంతెందుకు పదిహేనేళ్ల క్రితమే నెల్లూరులో డిప్యూటీ డిఇఓగా పనిచేశాడు. అప్పుడే కుప్పలకొద్దీ ఆరోపణ లొచ్చాయి. టీచర్ల పట్ల వేధింపులకు పాల్పడేవాడనే పేరొచ్చింది. డిప్యూటీ డిఇఓగా అతనిని భరించి ఉండబట్టే రెండేళ్ల క్రితం అతను నెల్లూరుకు డిఇఓగా వస్తున్నాడంటే జిల్లాలోని టీచర్లందరూ హడలిపోయారు. కాని, ఎవరు ఎన్ని విధాలుగా ఆందోళనలు చేసినా మువ్వా రామలింగం చదువుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావును పట్టాడు. గంటా మొదటిసారి నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చినప్పుడు 'మీ అభిమాని' అనే పేరుతో జిల్లా అంతటా ఆయనకు స్వాగతం పలుకుతూ భారీఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు. అవన్నీ కూడా మువ్వా రామలింగం సొంత ఖర్చుతో ఏర్పాటు చేయించినవేనని ఆ తర్వాత తెలిసింది. అలా గంటాకు గంటకొట్టి మువ్వా ఈ జిల్లాకు డిఇఓగా వచ్చాడు. ఒక అధికారి ట్రాక్‌రికార్డు బ్యాడ్‌గా వుందని తెలిసినా, అతనిని డిఇఓగా వేయొద్దని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేసినా విద్యాశాఖమంత్రి అతనినే డిఇఓగా వేశాడు. దాని ఫలితంగా జిల్లా విద్యాశాఖలో జరగాల్సిన కంపు అంతా జరిగిపోయింది. కాబట్టి ఇక్కడ తప్పు మువ్వాదే కాదు, అతని చేతికి తాళాలు ఇచ్చిన మంత్రి గంటాది కూడా!




17వ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి
(మరణం - 18.09.2000)
మహనీయుని దివ్యస్మృతికి మా భాష్పాంజలి

భార్య
జక్కా కామేశ్వరమ్మ

కుమారులు
జక్కా కోదండరామిరెడ్డి
జక్కా శ్రీనివాసులురెడ్డి
జక్కా శివనారాయణరెడ్డి

మరియు
కుటుంబసభ్యులు

నెల్లూరు కబుర్లు

# నగరంలో మార్పులకు శ్రీకారం

నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి నగరపాలక సంస్థ శ్రీకారం చుడుతోంది. స్మార్ట్‌సిటి నిధులు రూ.33కోట్లు మంజూరు కావడంతో వాటితో అవసరమైన చోట నడక మార్గాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దీంతో రోడ్లపై ప్రమాదాలను అరికట్టే అవకాశంవుంది. ఇందులో భాగంగా ఎక్కువరద్దీగా ఉండే రహదారులైన మెయిన్‌రోడ్డు, మినీబైపాస్ వెంబడి తొలుత నడకదారులు నిర్మించాలని తీర్మానించారు. ప్రధాన రహదారి వెంబడి ఆత్మకూరు బస్టాండ్ నుంచి బుజబుజనెల్లూరు వరకు 12కి.మీ. పొడవున, మినీబైపాస్‌రోడ్డు వెంబడి ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి కూడలి వరకు 10కి.మీ. పొడవున రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నారు. ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి సంబం



ధించి ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. మినీబైపాస్‌రోడ్డు 80అడుగుల నుంచి 100అడుగుల వెడల్పు ఉండటంతో ఆ రోడ్డు మొత్తం దాదాపుగా ఒకే కొలతతో ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. మెయిన్‌రోడ్డు విషయానికొస్తే కొన్ని చోట్ల 120అడుగులు, మరికొన్ని చోట్ల 70అడుగుల మేర రహదారి ఉండడంతో రోడ్డు వెడల్పును బట్టి ఫుట్‌పాత్ కొలతలు నిర్ణయిస్తున్నారు. ఈ రోడ్డుకు సంబంధించి తొలిగా శబరి శ్రీరామక్షేత్రం నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు కూడా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. రెండో విడతలో బట్వాడిపాలెం నుంచి పొదలకూరురోడ్డు, హరనాథపురం రోడ్డు వెంబడి నడకదారులు నిర్మించనున్నారు. ఇవన్నీ పూర్తయితే పాదచారులు రాకపోకలు సాగించడానికి సౌకర్యవంతంగా ఉంటుంది.

## రోడ్లపై తిరిగిన ఎస్పీ, కమిషనర్

జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావులు 9వ తేదీ నెల్లూరులో ట్రాఫిక్ స్థితిగతులను పరిశీలించారు. పెద్దబజారు, చిన్నబజారు, ఆత్మకూరు బస్టాండు, రామలింగాపురం సెంటర్, విఆర్‌సి సెంటర్‌లలో తనిఖీలు చేసారు. ట్రాఫిక్‌కు పెద్ద అవరోధంగా మారిన ఆక్రమణలను తొలగించాలని వారు అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌ను దారిలోకి తేవడం కోసం ఇంకా పలు సూచనలు చేశారు.

# వాకర్స్‌కు ఆరోగ్యంపై అవగాహన




నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు అధ్యక్షతన ఈ నెల 10వ తేదీన జనరల్ సర్జన్ డాక్టర్ ప్రకాష్ వాకర్స్‌కు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల్లో ఎర్త్‌వార్మ్స్ రావడం వల్ల కడుపునొప్పి వస్తుందన్నారు. నాన్‌వెజ్, మసాలా కూరలు ఎక్కువ తినేవాళ్ళకు అపెండిసైటిస్ వస్తుందన్నారు. 10సంవత్సరాలు లోపు, 60 సంవత్సరాలుపైన వయస్సు గల వారికి అపెండిసైటిస్ వస్తే ప్రమాదకరమన్నారు. టమోటో, క్యాబేజీ, వంకాయ, పాలకూరలు తినడం వల్ల కిడ్నీలో రాళ్ళు ఏర్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, ఎస్.రాఘవేంద్రషెట్టి, డా॥ అంకిరెడ్డి, డా॥ సత్యనాథ్, ఓబులురెడ్డి, డా॥ దొరస్వామి నాయుడు, తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తిండి తెచ్చిన తిప్పలు

ఎప్పుడూ వివాదాలకు కేంద్రబిందువుగా వుండే విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో హాస్టల్ నిర్వహణ సక్రమంగా వున్నట్లు లేదు. 11వ తేదీ రాత్రి కాకుటూరులోని యూనివర్శిటీ హాస్టల్‌లో భోజనం తిన్నాక 5మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్‌పాయిజన్ కావడంతో వాళ్ళు అక్కడే కళ్ళు తిరిగి పడిపోయారు. వెంటనే వారిని నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు.

## దేశాయిశెట్టిని
# పరామర్శించిన సోమిరెడ్డి



ప్రముఖ న్యాయవాది, టీడీపీ సీనియర్ నాయకుడు దేశాయిశెట్టి హనుమంతురావును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. దేశాయిశెట్టి తండ్రి గణపతిరావు ఇటీవల కన్నుమూసారు. సోమిరెడ్డి ఆదిత్యనగర్‌లోని దేశాయిశెట్టి ఇంటికి వెళ్ళి ఆయనను పరామర్శించి, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

# ఏఆర్ డీఎస్పీగా చంద్రశేఖర్

నెల్లూరు ఏ.ఆర్ డిఎస్పీగా బి.చంద్రశేఖర్‌ను నియమిస్తూ డిజిపి సాంబశివరావు ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏఆర్ డిఎస్పీగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇంతకుముందు ఇక్కడ ఏఆర్ డిఎస్పీగా వున్న చెంబిరెడ్డిని నాలుగు నెలల క్రితం డిజిపి కార్యాలయానికి అటాచ్ చేసారు. అప్పటి నుండి ఖాళీగా వున్న పోస్ట్‌లో చంద్రశేఖర్‌ను నియమించారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ
# కార్యదర్శిగా ఎం.శేఖర్‌బాబు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా గుంటూరుజిల్లాలో గ్రేడ్-1 గ్రంథాలయ అధికారిగా పనిచేస్తున్న ఎం.శేఖర్‌బాబు నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన ఈనెల 9న పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై ఇక్కడకి విచ్చేసిన శేఖర్‌బాబు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారిగా బాధ్యతలు స్వీకరించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి. నాగేంద్రరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు, ఉద్యోగుల సంఘం తరఫున జిల్లా కార్యదర్శి రవీంద్రనాథ్‌రెడ్డి, కోశాధికారి జి.రవీంద్రన్, ప్రాంతీయ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకటకృష్ణయ్య, ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.సునీత తదితరులు కొత్త కార్యదర్శి శేఖర్‌బాబుకు అభినందనలు తెలిపారు.

# తగ్గిపోతున్న ట్రాక్టర్లు



పెన్నానది రీచ్‌ల నుంచి ఇసుకను తరలించే ప్రతి ట్రాక్టర్‌కు జిపిఎస్ పరికరాన్ని అమర్చాలని జిల్లా ఎస్పీ రామకృష్ణ ఇటీవల గట్టిగా హెచ్చరించడం తెలిసిందే! దీనికి తగ్గట్లు పోలీసులు కూడా ఇసుక ట్రాక్టర్ల తనిఖీలు మొదలుపెట్టారు. జిపిఎస్ పరికరాలు అమర్చుకోకుండానే వందల ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా పొట్టేపాళెం రీచ్ నుండి జొన్నవాడ రోడ్డుగుండా నగరంలోకి వందలాది ట్రాక్టర్లు వస్తుంటాయి. ఇటీవల పోలీసులు పెద్ద ఎత్తునే జిపిఎస్ అమర్చని ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇంతకాలం జిపిఎస్ సిస్టం అమర్చుకోకుండా ట్రాక్టర్ల వాళ్ళు ఇష్టమొచ్చినట్లుగా ఇసుకను తరలించారు. ఇప్పుడు జిపిఎస్ సిస్టంతో అక్రమరవాణాకు వీలు కావడం లేదు. జిపిఎస్ సిస్టం నిబంధనను కఠినంగా అమలు చేస్తుండడంతో ఇసుక తోలకం ట్రాక్టర్లు చాలా తగ్గాయి.

# డాక్టర్ బిందుమీనన్‌కు అంతర్జాతీయస్థాయి అవార్డు



నెల్లూరులోని ప్రముఖ వైద్యురాలు, అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో సీనియర్ న్యూరాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ బిందుమీనన్‌కు అంతర్జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఎపిలెప్సి కాంగ్రెస్ లీడర్‌షిప్ అవార్డు లభించింది. స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఇంటర్నేషనల్ ఎపిలెప్సి కాంగ్రెస్‌వారు ఈ అవార్డును డాక్టర్ బిందుమీనన్‌కు అందజేసినట్లు ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. గత పదేళ్ళుగా మూర్ఛవ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డాక్టర్ బిందుమీనన్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు వారు పేర్కొన్నారు. మూర్ఛవ్యాధి గ్రస్తులకు ఉపయోగపడేవిధంగా ఫ్రీ ఎపిలెప్సి యాప్‌ను, స్ట్రోక్, మూర్ఛవ్యాధితో బాధపడే వారికి ఉచిత టెలిఫోన్ చికిత్స సౌకర్యం వంటి కార్యక్రమాలను ఆమె చేపట్టినట్లు వారు తెలిపారు. అంతర్జాతీయస్థాయి అవార్డు పొందిన ఆమెకు ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# రంగనాథుని దర్శించుకున్న రామానుజ జియర్ స్వామి



వనమామలై మఠం పీఠాధిపతి శ్రీరామానుజ జీయర్ స్వామి సోమవారం నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకున్నారు. భగవద్రామానుజాచార్యుల వైష్ణవ సిద్ధాంతం ప్రకారం, జాతీయ పర్యటనలో భాగంగా నెల్లూరు విచ్చేసిన స్వామీజీ స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామికి ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు, పాలకమండలి ఛైర్మెన్ మంచికంటి సుధాకర్, సభ్యులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. మఠం ప్రతినిధి జి.తిరుమల భరద్వాజ్, నెల్లూరు వనమామలై పీఠం మేనేజర్ కేటి వెంగడ రామానుజాచార్యులు, వెల్లంచేటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

● దుగరాజపట్నం పోర్టు...




# చించేసిన చీటీకి పాకులాట!

మొన్నటిదాకా దుగరాజపట్నం పోర్టు సాధిస్తానంటూ మాజీఎంపీ చింతా మోహన్ కలరింగ్ ఇచ్చాడు. ఈమధ్య ఆయన సైలంట్ అయ్యాడు. తాజాగా తిరుపతి ఎంపి వెలగపూడి వరప్రసాదరావు పోర్టు పాటందుకున్నాడు. పోర్టు సాధన కోసమంటూ మొన్న ఒకరోజు దుగరాజపట్నంలో దీక్ష కూడా చేశాడు. కాని, దుగరాజపట్నం పోర్టు అన్నది కేంద్రప్రభుత్వం చించేసిన చీటీ! ఈ ఫైల్‌ను పక్కనపడేసింది. ఇస్రో, పర్యాటక శాఖ అభ్యంతరాలతో పాటు ఇక్కడ పోర్టు పెట్టినా పెద్దగా లాభముండదని సర్వే నిపుణులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ పోర్టు ఫైల్‌ను అటకెక్కించారు.

జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వుంది. మొత్తం 41 బెర్త్‌ల నిర్మాణం లక్ష్యం. ఇప్పటికి 13 బెర్త్‌లు పూర్తయ్యాయి. ఆ పూర్తయిన బెర్త్‌లకే సరిగా వ్యాపారం లేదు. బళ్లారి, అనంతపురంల నుండి ముడి ఇనుపఖనిజం రవాణా ఆగిపోవడం పోర్టుకు పెద్ద షాక్. ఇటీవల విద్యుత్ ప్రాజెక్ట్‌లు కూడా అంతంత మాత్రంగా వున్నాయి. విదేశాల నుండి బొగ్గు దిగుమతులు కష్టంగా వున్నాయి. పోర్టుకు ఈ రెండూ ప్రధాన ఆధారం. ఆ రెండూ ఆగిపోయాయి. ఇటీవల గ్రానైట్, యూరియా, కంటైనర్ వ్యాపారం పెరగబట్టి సరిపోయింది. లేకుంటే పోర్టులో కట్టి వున్న ఆ బెర్త్‌లు కూడా ఖాళీగానే వుండేవి. జిల్లాలోకి కొత్తగా భారీ పరిశ్రమలు వస్తే పోర్టుకు వ్యాపారం ఉంటుంది. ఎగుమతులు, దిగుమతులు ఉంటాయి. పరిశ్రమలు పెద్దసంఖ్యలో వచ్చి ఎగుమతులు, దిగుమతులు ఎక్కువై ఇప్పుడున్న పోర్టు సరిపోకపోతే జిల్లాలో ఇంకో పోర్టుకు అవకాశముంటుంది. జిల్లాలో గత 5ఏళ్ల నుండి ఒక్క పరిశ్రమ లేదు. పారిశ్రామికంగా ఎలాంటి అభివృద్ధి లేదు. అలాంటప్పుడు పోర్టులు కట్టుకొని ఏం లాభం. బస్సులు రాని ఊరిలో బస్టాండ్ కట్టినట్లుగా వుంటుంది.

# ఉత్సాహంగా వందేళ్ళ ఉత్సవం




- నలుగురు మంత్రుల సమక్షంలో వేడుక
- మాజీచైర్మెన్‌లకు గౌరవసత్కారం
- భారీగా హాజరైన అన్నదాతలు



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు శత వసంతోత్సవ వేడుకలు ఈ నెల 8వ తేదీ బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అందమైన వేదికపై అద్భుతంగా జరిగాయి. బ్యాంకుతో అనుబంధం వున్న ప్రతిఒక్కరినీ పాలకవర్గం ఈ వేడుకకు ఆహ్వానించింది. బ్యాంకుకు వెన్నెముకలాంటి రైతులు పెద్దసంఖ్యలో వేడుకకు హాజరయ్యారు. బ్యాంకు ఆవరణంలో వందేళ్ల ఉత్సవ పైలాన్‌ను ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి ఆవిష్కరించారు. బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భారీ వేదికపై రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎస్.ఆదినారాయణరెడ్డి, ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, పి.నారాయణ, ఆప్కాబ్ ఛైర్మెన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, తెలంగాణ సహకార బ్యాంకు ఛైర్మెన్ రవీందర్‌రావు, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, మాజీఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, బ్యాంకు మాజీ ఛైర్మెన్ ఆనం భక్తవత్సలరెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, రాపూరు మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెన్ను బాలకృష్ణారెడ్డి, తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు తదితరులు పాల్గొన్నారు. బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సభకు అధ్యక్షత వహించి దాదాపు మూడున్నర గంటలపాటు సభను ఎంతో హూందాగా నడిపించాడు. వందేళ్ళ వేడుకలో అందరూ తమ అభిప్రాయాలను వెలిబుచ్చే అవకాశం కల్పించారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ బ్యాంకుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 1987లో తాను బ్యాంకు ఛైర్మెన్‌గా పని చేసిన సమయంలో బ్యాంకు కష్టాల్లో, నష్టాల్లో ఉండేదని, అప్పుడే ఎన్టీఆర్ సహకార వ్యవస్థను ప్రక్షాళన చేసి సరైన మార్గంలో పెట్టారని చెప్పాడు. ఇప్పటి వరకు బ్యాంకుకు 16మంది ఛైర్మెన్‌లుగా పనిచేస్తే, వారిలో 10మంది పైలోకాల నుండి దీవిస్తున్నారని, మరో ఆరుగురు ఇప్పటికీ బ్యాంకు పురోభివృద్ధికి సహకరిస్తున్నారని చెప్పాడు. మరోమంత్రి నారాయణ 1918లో బ్యాంకు ప్రారంభమైందని చెబుతూ బ్యాంకు ప్రగతిని వివరించాడు. జిల్లాలో ప్రస్తుతం పది లక్షల ఎకరాల ఆయకట్టు వుందని, గోదావరి నీళ్లు తెచ్చి మరో 5లక్షల ఎకరాల ఆయకట్టు పెంచుతామన్నాడు. సహకార మంత్రి ఎస్.ఆది నారాయణరెడ్డి తన ప్రసంగంలో సహకార బ్యాంకుల ద్వారా కూడా విరివిగా ముద్ర ఋణాలివ్వాలని, ఋణాల పరంగా రైతు లకు మనం సహకరిస్తే, ఎన్నికలప్పుడు వాళ్ళు మనకు సహకరిస్తారని చెప్పాడు. జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల్లా కాకుండా రైతులను నిజంగా ఆదుకుంటున్న బ్యాంకు సహకార బ్యాంకేనని చెప్పాడు. వాణిజ్య బ్యాంకులకు పోటీగా రైతులకు పంట ఋణాలను, బంగారు ఋణాలను ఇవ్వాలని సూచించాడు.

మంత్రులతో పాటు ఈ వేదికపై అతిథులు చాలామందే ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రుల చేతులమీదుగా రైతులకు ట్రాక్టర్లు, ఋణాలు పంపిణీ చేశారు. ఈ సభలో బ్యాంకు మాజీఛైర్మెన్‌లను, 20ఏళ్ల పాటు సొసైటీ ఛైర్మెన్‌లుగా పనిచేసిన వారిని, అలాగే 20ఏళ్ల నుండి ఖాతాదారులుగా ఉన్నవారిని కూడా సభలో సత్కరించారు. బ్యాంకు ఉపాధ్యక్షుడు నల్లపురెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సిఇఓ సరిత, బ్యాంకు డైరక్టర్లు, ఉద్యోగుల యూనియన్ నాయకులు, సిబ్బంది ఈ వేడుకలలో పాల్గొని విజయవంతం చేయడంలో తమవంతు బాధ్యతను నిర్వర్తించారు.


వందేళ్ళ ప్రత్యేక సావనీర్ విడుదల చేస్తున్న ముఖ్యఅతిథులు


బ్యాంకు మాజీచైర్మెన్ ఆనం భక్తవత్సలరెడ్డికి సన్మానం

# పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడం వల్లే రాష్ట్రంలో పలు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తవుతున్నాయని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. 11వ తేదీ నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిధులు లేకుండానే నెల్లూరు, సంగం బ్యారేజీల పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేసిందని, తెలుగుదేశం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఈ బ్యారేజీలను పరిశీలించి నిధులు మంజూరు చేసారని చెప్పారు. మార్చిలో నెల్లూరు బ్యారేజీని, జూన్‌లో సంగం బ్యారేజీని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. రాబోయే మూడేళ్లలో గోదావరి జలాలను పెన్నకు తరలించి నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాలకు కూడా సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జిల్లాలో 175 టిఎంసీలు నీటిని నిల్వబెట్టి ఆయకట్టును 15లక్షల ఎకరాలకు పెంచడమే తమ లక్ష్యమని చెప్పారు. నీరు-చెట్టు పనుల్లో నెల్లూరుజిల్లా రెండోస్థానంలో వుందని, ఇప్పటివరకు నీరు-చెట్టు, ఇరిగేషన్ పనులకు వెయ్యికోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.







## మూలాపేట శివాలయంలో...
# 21నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుల సహకారంతో మహోత్సవాలను విశేషంగా నిర్వహించనున్నామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6.30గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈనెల 21వ తేదీ సాయంత్రం 5.30గంటలకు కలశస్థాపనతో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి 7గంటలకు భవానీ అలంకారం, 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7గంటలకు నవావరణపూజ, పుష్పాలంకరణ, 8గంటలకు చండీహోమం జరుగుతాయన్నారు. 22న భువనేశ్వరిదేవి అలంకారం, 23న త్రిపురసుందరి అలంకారం, 24న రాజరాజేశ్వరి అలంకారం, 25న అన్నపూర్ణాదేవి అలంకారం, 26న చండీ అలంకారం, 27న సరస్వతిదేవి అలంకారం, 28న దుర్గాదేవి అలంకారం, 29న మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 30వ తేదీ సాయంత్రం 5గంటలకు స్వామి అమ్మవారికి పూలంగిసేవ, రాత్రి 7గంటలకు శమిపూజ, ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు గంగుల జనార్ధన్‌యాదవ్, ఎం.వెంకటేశ్వర్లునాయుడు, పాలెపు శివప్రసాద్ రెడ్డి, కొండూరు గీత, ఆలయ అర్చకుడు శ్రీశైలం భార్గవ్‌శర్మ పాల్గొన్నారు.

# నాయకుణ్ణి కాదు.. ప్రజా సేవకుణ్ణి

**- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



"నేను నాయకుడిగా కాక ప్రజా సేవకునిగా ఉంటా..ప్రజల సమస్యల సాధన కోసం నిత్య ఉద్యమకారునిగా ఉద్యమిస్తా' నని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11న ఆయన రూరల్ మండలంలోని నీలగిరిసంగంలో 'వైఎస్ఆర్ కుటుంబం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా స్థానికుల ఇళ్ళ వద్దకు వెళ్ళి అక్కడి ప్రజలతో మాట్లాడారు. స్వయంగా ఇళ్ళకు పార్టీ స్టిక్కర్లు అంటించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో తనకు అండగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. నెల్లూరు రూరల్‌లో ప్రజల దయతో ఎమ్మెల్యేగా ఎన్నికైన తాను గత మూడున్నర సంవత్సరాలుగా ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూ, అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల మధ్యలో ఉంటూ సమస్యల సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని, హంగు ఆర్భాటానికి దూరంగా ఉంటూ జనంతో కలసి ముందుకు సాగుతున్నానని, ప్రజల అభిమానమే తనకు శ్రీరామరక్ష అని ఆయన అన్నారు. తాను నాయకునిగా కాక, ప్రజలకు సేవకుని వలె పనిచేస్తున్నానని, అందువల్లే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు సాధించానన్నారు. అందుకే, ఏ సంస్థలు సర్వే చేసినా నెం.1 ఎమ్మెల్యేగా ప్రజలందరి అభిమానానికి పాత్రుడనవుతున్నానన్నారు. ప్రజల అభిమానాన్ని, పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని కాపాడుకుంటానని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా రెట్టించిన సమరోత్సాహంతో ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్‌రావు, పార్టీ పరిశీలకులు మిద్దె మురళీకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విడవలూరులో విశ్వనాధ జయంతి



జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12న విడవలూరులోని డిగ్రీ కళాశాల తెలుగు విభాగంవారి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ అష్టావధాని కోట రాజశేఖర్ విచ్చేసి విశ్వనాథవారి రచనల విశిష్టతపై ఉపన్యసించారు. ప్రత్యేకించి విశ్వనాథవారి అత్యద్భుత రచనా శైలిని గురించి విద్యార్థులకు తెలియజేశారు. విశ్వనాథ జీవిత విశేషాలతో పాటు, ఆయన రచనల్లో ముఖ్యమైన వేయి పడగలు, రామాయణ కల్పవృక్షం తదితర రచనల్లోని విశేషాలను, వైశిష్ట్యాన్ని చక్కగా వివరించారు. తెలుగు భాషకు విశ్వనాథ వారు చేసిన సేవలు అమూల్యమైనవని, తెలుగువారి హృదయాల్లో ఆయన స్థానం సుస్థిరమైనదని అన్నారు. అనంతరం అవధాని కోట రాజశేఖర్‌ను కళాశాలవారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.వి రమణరావు, డాక్టర్ ఐఎస్ చక్రపాణి, తెలుగు ఉపన్యాసకులు శ్రీదేవి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

### శ్రీకంటి నాగరాజారావుకు

## బ్రాహ్మణ సేవాసంఘం సంతాపం



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం హనుమంతరావునగర్‌లోని బ్రాహ్మణ సేవాసంఘ అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు నివాసంలో శ్రీకంటి నాగరాజారావు సంతాప సభ జరిగింది. నాగరాజారావు మరణానికి బ్రాహ్మణసేవాసంఘం తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు, ఆనిమెళ్ళ శివకుమార్ మాట్లాడుతూ నాగరాజారావు షిరిడిసాయిబాబా భక్తుడు గాను, న్యూమరాలజీలోను, ఇన్‌కంటాక్స్ ప్రాక్టీషనర్‌గాను మంచి అనుభవం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. నాగరాజారావు సోదరుడు ప్రముఖ సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్, ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత శ్రీకంటి రామమోహన్‌రావు వీరిద్దరు కలసి చారిటీస్ ద్వారా గూడూరు పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రావణ్‌కుమార్, డి.బి.శ్రీనివాసరావు, శ్రీనివాసకుమార్, ప్రసాద్, పురుషోత్తం, ప్రభాకర్, గోపి, అమర్, వై.వి.రావు, ఇసకపల్లి శివప్రసాద్, శ్రీనివాసచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌పిపి విద్యార్థిని అమూల్యకు బంగారు పతకం



గూడూరు లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్‌స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎన్.అమూల్య సెప్టెంబర్ 8, 10వ తేదీలలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్, జూనియర్స్ అండర్ 29 - 31 బరువు గల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు, స్టేట్ రెఫరీ & కోచ్ యు.పవన్‌కుమార్ మరియు గూడూరు కోచ్‌లు యు.సునీల్, పి.గణేష్‌లు తెలియజేశారు. నవంబర్ నెలలో ముంబయిలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు కూడా అమూల్య ఎంపికైనందున ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు జి.నాగేశ్వర్‌రావు, లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్‌స్కూల్ యాజమాన్యం శ్రీకాంత్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రిన్సిపల్, పి.ఇ.టిలు అభినందనలు తెలియజేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు లయన్స్ సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రతినిధులు

సమాజంలో అత్యంత విలువైనది చదువు మాత్రమేనని, ఆ చదువు ద్వారానే ప్రతిఒక్కరిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు ఉపాధ్యాయుడి కృషి ఎనలేనిదని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కరరెడ్డి అన్నారు. గూడూరు ఎంపిడివో కార్యాలయంలో ఆదివారం గురుపూజోత్సవం సందర్భంగా మండలంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని కోశాధికారి కడివేటి చంద్రశేఖర్, కార్యదర్శి జి.చంద్రశేఖర్ నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మోహన్, రవి, కరిముల్లా, రవూఫ్, సుబ్రహ్మణ్యం, శిద్దలయ్య, కళ్యాణి, సులోచన తదితరులను ఘనంగా పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, ప్రతిఒక్కరికి అక్షరాలను నేర్పించే గురుతర బాధ్యత ఒక్క ఉపాధ్యాయుడికే సాధ్యమని తెలిపారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో, పట్టుదలతో స్ఫూర్తిదాయకంగా ఆదర్శవంతంగా నిబద్ధతతో పనిచేస్తే మంచి గుర్తింపు, విద్యార్థుల భవిష్యత్ బంగారంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి, ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్, క్లబ్ ప్రతినిధులు అక్కన రమణయ్య, జక్కంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రామ్‌మోహన్, పలు ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


### పంచాయితీరాజ్ ఇంజనీర్లకు

## బయోమెట్రిక్ మినహాయింపు ఇవ్వాలి



రియాజ్ అహ్మద్

క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పంచాయతీరాజ్ ఇంజనీర్‌లను బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయించాలని ఏపి పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలో నిర్వహించి పలు తీర్మానాలను చేసినట్లు, అందులో క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు పనుల పర్యవేక్షణకు ఉంటున్న కారణంగా, బయోమెట్రిక్ వేయడం సాధ్యం కాదని ఎన్ఆర్‌జీఎస్ పనుల్లో ఇంజనీర్‌లను వేధింపులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంజనీర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.



గురుపూజోత్సవం సందర్భంగా ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న గూడూరు మండలం చవటపాలెం స్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ముప్పాళ్ళ పురంధరరాజు.



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల గూడూరు మండలంలోని పుట్టంరాజువారికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న షేక్ జావిద్‌బాషాకు ఉత్తమ ఉపాధ్యాయ ప్రశంసాపత్రాన్ని బహుకరించి సన్మానిస్తున్న ఎంఇఓ వి.సూర్యనారాయణ, జడ్పీటీసీ మరియు డిప్యూటి ఇఓ తదితరులు



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 15.9.2017 నుండి
తేది. 21.9.2017 వరకు

ఈ వారము మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, సింహంలో శుక్రబుధకుజులు, కన్యలో రవి, తులలో గురువు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

మహాలయ పక్షము జరుగుచున్నది. శుభకార్యములుండవు.
కావేరి పుష్కరాలు జరుగుచున్నవి.
తేది 19 మంగళవారం ఉదయం గంట 11.0ల తరువాత మహాలయ అమావాస్య. పితృకర్మలు జరుపవలెను.
తేది 21 దేవీ నవరాత్రములు ప్రారంభము.

**భాద్రపద మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | దశమి | సా॥ గం.6.40వ॥ |
| తేది. 16 | శని | ఏకాదశి | సా॥ గం.4.26వ॥ |
| తేది. 17 | ఆది | ద్వాదశి | ప॥ గం.2.27వ॥ |
| తేది. 18 | సోమ | త్రయోదశి | ప॥ గం.12.44వ॥ |
| తేది. 19 | మంగళ | చతుర్దశి | ప॥ గం.11.21వ॥ |
| తేది. 20 | బుధ | అమావాస్య | ఉ॥ గం.10.25వ॥ |

**ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | గురు | పాడ్యమి | ఉ॥ గం.9.58వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆలోచనలు, అభివృద్ధి ప్రయత్నాలు వేగవంతంగా జరుగుతాయి. పిల్లల విద్యా వివాహ విషయాలపై చర్చ లుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయము తృప్తికరం. దూరప్రాంత ప్రయాణాలు నిర్ణయం కాగలవు. అనుకున్న పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆరోగ్యం క్రమంగా చేకూరుతుంది. బంధుమిత్రుల సహాయ సహ కారాలుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

మీ ప్రయోజనాలకు బంధువులు, స్నేహితులే అడ్డు పడుతారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. రాబడి తగ్గుతుంది. కొన్ని అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరగడం, పెట్టు బడులకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. ఉద్యో గులకు పనివత్తిడి పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో బాగా సిద్ధమై ప్రయత్నించండి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

రావలసిన బాకీలు నిలబడిపోతాయి. కుటుంబ, వ్యాపార వ్యవహారాలను సొంతంగా పరిశీలిస్తుండాలి. వృత్తి వ్యాపారాలు కొంత మెరుగుగా ఉంటాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది ఇతరులకు ఆర్థికంగా, మాట రూపంలో సహాయపడతారు. కొత్త స్నేహాలు పరిచయాలుంటాయి. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. విద్యాప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

సరైన సమయం సరైన నిర్ణయాలు తీసికొనలేక టెన్షన్ పడుతుంటారు. సమయానికి జ్ఞాపకాలు రావు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలందు అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. పనులు అనుకొన్నవి నిదానంగా సాగుతాయి. కొత్త వ్యాపార ప్రయత్నాలకు, పెట్టుబడులకు అనుకూల అవకాశాలుం టాయి. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ అవసరం.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

మంచి ఆర్థిక ప్రణాళికలతో ముందుచూపుతో వృత్తి వ్యాపారాలందు ప్రదర్శించి ఆదాయం పెంచుతారు. ప్రభుత్వ పరంగా అనుమతులు, ఋణాలు లభిస్తాయి. దూరప్రాంతాలకు పోవడానికి ఆహ్వానాలు అందుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తుల కొనుగోలు ప్రయత్నాలు ఆలోచనలుంటాయి. ఉద్యోగులకు పని భారం ఉండినా అధికారుల నుండి గుర్తింపుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

తొందరపాటు మాటలు, ప్రవర్తన తగ్గించుకొనండి. వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. స్వల్ప ఆర్థిక ఇబ్బందులుండవుచ్చును. కుటుంబంలో గాని, బంధు వర్గంలో గాని అనారోగ్య బాధితులుంటారు. కొన్ని అన వసర ఖర్చులుంటాయి. ఆత్మీయులతో, బంధువులతో జాగ్రత్తగా మెలగండి. ఆర్థిక లావాదేవీలు, క్రయవిక్ర యాలు వాయిదా వేసికొంటే మంచిది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకోని ఖర్చులు, మొగమాటం వల్ల ఖర్చులు అదనంగా ఉంటాయి. దైవకార్యాలు, సభలు సమావేశా లలో పాల్గొంటారు. అనుకున్న పనులను సమర్థవంతంగా జరుపుకొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం, అభివృద్ధి అవకాశాలుంటాయి. అప్పులను, హామీలను త్వరపడి ఇవ్వవద్దు. ఉద్యోగులకు స్థానమార్పులు, అధికార వర్గ సహకారం ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలలో పెరుగుదలతో పాటు రాబడి పెరుగుతుంది. కుటుంబసభ్యులతో సమస్యలు రాకుండా జాగ్రత్త పడండి. ప్రభుత్వం నుండి రావలసిన బాకీలు, అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. శుభకార్య నిర్ణయాలు జరిపి పనులందు నిమగ్నం కాగలరు. వ్యాపారులకు, ఉద్యోగులకు అధికారుల వల్ల వత్తిడి ఉంటుంది. దూరప్రయాణాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనాలి. అనుకున్న పనులకు ఆటంకాలు కలిగి ఆందోళన కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. షేర్లు, పెట్టుబడులపై లాభాలుంటాయి. ఉద్యోగులకు కార్యదక్షత, అధికారవర్గం నుండి సహకారం లభిస్తుంది. రావలసిన బాకీలు, వస్తువులను పొందుతారు. విద్యార్థులు మరింత కృషి చేయవలసి ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించండి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప ఇబ్బందులుంటాయి. రాబడి సామాన్యంగా ఉంటుంది. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. గృహ వస్తువాహన రిపేర్లుంటాయి. వాహనాలు నడపడం, కరెంటు పనులందు జాగ్రత్త అవసరం. ప్రయాణాలు ప్రయోజనకరంగానే ఉంటాయి. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికంగా స్థిరపడటం ప్రారంభం కాగలదు. రాబడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో అనుకూలత ఉం టుంది. ఉద్యోగులు వ్యాపారులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తపడండి. కొత్త వ్యాపారాలు, భాగ స్వామ్య వ్యాపారములు అనుకూలిస్తాయి. కుటుంబ సభ్యులను సమన్వయం చేసికొంటూ సాగండి. కొత్త వస్తువులు సమీకరించుకొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

పనులు సకాలంలో నిర్వహిస్తారు. ఇంటా బయట ప్రత్యర్థులను, అవరోధాలను తొలగించుకొనగలరు. వ్యాపార వృద్ధి ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబంలో, బంధువులలో ఒకరు అనారోగ్యంతో బాధ పడతారు. వస్తు వాహనాలు పోగొట్టకొనకుండా జాగ్రత్త పడాలి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత తక్కువ. పెట్టుబడులకు ప్రోత్సాహం బాగుంటుంది.

# ‘కిమ్’ను దారికి తెచ్చిన నెల్లూరోళ్లు

శ్రీను గల్పిక

దూకుడు తగ్గించిన ఉత్తర కొరియా... ఆగిన మిస్సైల్స్ ప్రయోగాలు... అంతు తెలియని వ్యాధితో బాధపడుతూ మంచాన పడ్డ ఉత్తర కొరియా అధినేత కిమ్... మధ్యప్రాచ్య దేశాలలో వెల్లివిరుస్తున్న శాంతి... తొలగిన యుద్ధభయాలు... కిమ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతుడు కావాలంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రార్థనలు... బీబీసీలో వస్తున్న ఈ వార్తలను వాషింగ్టన్‌లోని వైట్ హౌస్‌లో కూర్చుని ట్రంప్‌తో పాటు జపాన్ ప్రధాని షింజోఅబే, జర్మనీ ఛాన్స్‌లర్ మోర్కెల్ ఏంజెల్, బ్రిటన్ ప్రధాని థెరిస్సామేలు చూస్తున్నారు. బీబీసీలో వచ్చిన వార్తను చూసి జపాన్ ప్రధాని షింజోఅబే నోరు తెరిచాడు. కిమ్‌కు ఏమైవుంటుంది, చూడండి ఒక్క మనిషి రోగంతో మంచానపడితే ప్రపంచం ఎంత ప్రశాంతంగా ఉందో... అతను ఎల్లకాలం ఇలాగే వుంటే బాగుండు... అందరం మన శ్శాంతిగా వుంటామని అన్నాడు. అందుకు ట్రంప్... ఆ కిమ్ ఇప్పు డిప్పుడే కోలుకోడు... కోలుకున్నా మునుపటిలా ఉద్రేకంతో వూగిపోడు, అతనిలోని శక్తినంతా లాగేసాము... అని చెప్పాడు. ఎలాగారు, అసలు కిమ్ ఎందుకు అలా తయారయ్యాడు. అతను మంచాన పడడానికి కారణ మేంటని షింజో అబే అడిగాడు. అప్పుడు ట్రంప్ వారిని ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్ళాడు.

★★★★★

వైట్‌హౌస్‌లో ట్రంప్ దిగులుగా కూర్చుని వున్నాడు. అప్పుడే భారత ప్రధాని నరేంద్ర మోడీ అక్కడకు వచ్చాడు. ట్రాజెడీ ఫేస్‌తో వున్న ట్రంప్‌ను చూసి విషయం ఏంటని మోడీ అడిగాడు. మీకు పాకిస్థాన్‌తో ఎలాంటి తలనొప్పులున్నాయో, నాకు ఆ కిమ్‌గాడితో అలాంటి తలనొప్పులే వున్నాయి. వాడి వంక సక్కంగా తీస్తే గాని నాకు మనశ్శాంతి లేదని ట్రంప్ అన్నాడు. దానికి మోడీ... అన్ని సమస్యలను శక్తితో అధిగమించలేం, కొన్నింటిని యుక్తితో మేధాశక్తితో గెలవగలం. నేను ఇండియా నుండి ఒక టీమ్‌ను పంపిస్తాను, మీ సమస్యను వాళ్ళే పరిష్కరిస్తారని చెప్పి మోడీ అక్కడనుండి లేచాడు.

వారం తర్వాత...

ప్రధాని నరేంద్రమోడీ ఆదేశాలతో మాజీఎమ్మెల్యే స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65+) నేతృత్వంలోని మేయర్ అజీజ్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఢిల్లీరావు, మరో పదిమంది కార్పొరేటర్ల బృందం అప్పుడే వైట్‌హౌస్‌కు చేరుకుంది. వివేకా బ్యాచ్ ట్రంప్ ఎదురుగా కూర్చుంది. దిగులుగా వున్న ట్రంప్‌ను చూస్తూ వివేకా... చెప్పండి మీ ప్రాబ్లం ఏంటి అని అడిగాడు. అందుకు ట్రంప్... అందమైన యువతులను చూస్తే చాలు... వారి అందాలను వర్ణించాలనిపిస్తుంది అని చెప్పాడు. ఈ సమస్య నాకు కూడా వుంది... కాకపోతే నీకు నోటి దూల ఎక్కువ కాబట్టి బయటపడతావు, నేను బయటపడనంతే... ఇది మందులు, మాకులతో నయమయ్యేది కాదు, మనుషులతో పాటే పోవాలి. నేను అడిగింది మీ అలవాట్ల గురించి కాదు, మీకేదో సమస్య వుందని మోడీ మమ్మల్ని పంపించాడు. దానిని పరిష్కరించి రమ్మని చెప్పాడు అని వివేకా అన్నాడు. అప్పుడు ట్రంప్‌కు ‘కిమ్’ విషయం గుర్తుకు వచ్చింది. ఓహో... మోడీ నాకు హెల్ప్ చేయమని వీరిని పంపించినట్లున్నాడు. అయినా అగ్రరాజ్య అధినేతనైన నాకే వణుకు తెప్పిస్తున్న ఆ కిమ్‌ను వీళ్లేం చేయగలరు అని మనసులో అనుకుంటూ ‘కిమ్’తో వస్తున్న సమస్యను చెప్పాడు. కిమ్ పిచ్చి చేష్టలతో మూడో ప్రపంచ యుద్ధం వచ్చేటట్లుందని చెప్పి ఆవేదన చెందాడు. అది విన్న వివేకా మనసులో... మేం నిన్ను పిచ్చోడివనుకుంటున్నాం, నువ్వే ఇంకొకడిని పిచ్చోడు అంటున్నావంటే వాడింకెంత పెద్దపిచ్చోడో అని అనుకుంటూ... సార్, ఆ కిమ్ సంగతేంటో మేం చూసుకుంటాం, ముందు వేం ఉత్తరకొరియా వెళ్ళడానికి స్పెషల్ ఫ్లైట్ అరేంజ్ చేయండి అని వివేకా అడిగాడు. ట్రంప్ వెంటనే అధికారులకు స్పెషల్ ఫ్లైట్ ఏర్పాటు చేయమని ఆదేశాలిచ్చాడు. వివేకా బృందం అక్కడనుండి లేచి ఎయిర్‌పోర్టుకు బయల్దేరబోతుండగా కమిషనర్ ఢిల్లీరావు చేతిలో వున్న సూట్‌కేసును చూసి ట్రంప్... ఆ సూట్‌కేసులో ఏముందని అడిగాడు. ‘కిమ్’ పని బట్టబోయే ఆయుధాలు అందులోనే ఉన్నాయని చెప్పి వివేకా అక్కడనుండి ముందుకు కదిలాడు.

★★★★★

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది. షింజో అబే వుండి... వివేకా టీం ఉత్తరకొరియాకు బయల్దేరింది. ఆ తర్వాతేం జరిగిందని అడిగాడు. దానికి ట్రంప్... వాళ్ళు రహస్యంగా ఉత్తరకొరియాలో అడుగుపెట్టారు. పర్యాటకుల మాదిరిగా అధ్యక్ష భవనానికి వెళ్లారు. అక్కడ కమిషనర్ ఢిల్లీరావు తన చేతిలో వున్న సూట్‌కేసును తెరిచాడు. అందులో నుండి కోట్లాది విషజీవులు బయటకొచ్చాయి. వాటిని ఇండియన్స్ ఐఆర్ 20-420 నెల్లూరు మున్సిపల్ ముదురుదోమలని పిలుస్తుంటారు. ఇలా ఒక్కో దోమ ఒక్కో అణుబాంబుతో సమానం. వంద బుల్లెట్ల కంటే పవర్‌ఫుల్. ఒక్క బుల్లెట్‌తో ఒక మనిషిని ఒక్కసారే చంపగలం. కాని ఒక దోమ వందమందినైనా కరవగలదు. వందలమందిని ఆసుపత్రి మంచమెక్కించగలదు. మనిషిని బ్రతక్కుండా అలాగని పూర్తిగా చావకుండా చేయగలదు. ఇవి కరిచాయంటే ఒకేసారి చావడం కాదు బ్రతికినంతకాలం ప్రతిరోజూ చస్తుండాల్సిందే! అంతటి శక్తివంతమైన ముదురుదోమలను కిమ్ గదిలో వదిలేసి వివేకా బృందం వెంటనే తిరిగొచ్చేసింది. ఆ తర్వాత ఏమైందో తెలియదు. రెండు రోజుల తర్వాత చూస్తే కిమ్ విషజ్వరంతో మంచం పట్టాడు. లోకం ప్రశాంతంగావుంది. ఏది ఏమైనా థ్యాంక్యు మోడీ... థాంక్యూ నెల్లూ రియన్స్ అని ట్రంప్ అన్నాడు. అది విన్న మిగతావాళ్లు కూడా కోరస్‌గా హేట్సాఫ్ నెల్లూరులీడర్స్ అని అరిచారు.

# 'సెల్ఫ్' కిల్లింగ్

'సెల్ఫీ' ఒక 'జ్ఞాపకం'గా మిగలాలి.. 'మరణం'గా కాదు





**ఏ సరదా అయినా..అందుకూ ఓ పరిమితి ఉంటుంది. హద్దులు దాటిపోయి మితిమీరిన ఉత్సాహంతో వళ్ళు తెలియకుండా ప్రవర్తిస్తే అది ఏ సరదా అయినా చివరికి ముప్పుగానే పరిణమిస్తుంది. ఈ అధునాతన కాలంలో యువత ముఖ్యంగా యువకులు సెల్ఫీ జోరుతో ప్రాణాల మీదికి తెచ్చుకోవడం ఎంతైనా విచారకరం. సెల్ఫీ తీసుకోవడం ఎంతో ముచ్చటైన అంశం. అయితే, అక్కడక్కడా కొన్ని సంఘటనల్లో అది బాధాకరంగా మిగులుతోంది. ఒక మధురమైన జ్ఞాపకంగా ఉండాల్సిన ఆ అంశం మరణంగా మిగులుతుండడమే విషాదం.**

సెల్ఫీ తీసుకోవాలనుకుని చివరికి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న వారి సంఖ్య ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోతోంది. సంతోషంగా సెల్ఫీ తీసుకుంటామని వెళ్ళిన తమ బిడ్డలు అలానే గాల్లో కలిసిపోయేరంటే ఆ తల్లిదండ్రులు పడే బాధ ఎలా ఉంటుందో ఒక్క సారి గ్రహించండి. నది ఒడ్డున సెల్ఫీ తీసుకోవడం మంచిదే కానీ, నది మధ్యలో కెళ్ళి సరదాగా సెల్ఫీ తీసుకోవాలనుకుని నదిలో మునిగిపోతే ఏమను కోవాలి?.. సెల్ఫీ తీసుకోవడం ఎంత ఫ్యాషనైనా, దాన్ని తీసుకోవడంలో ఏమరుపాటు వహించి కొందరు ప్రమాదాల పాలవుతున్నా ఎవరూ పట్టించు కోవడం లేదు. ఇంకా మరికొందరు అదే దారిలో వెళ్ళిపోతూనే ఉన్నారు. మొన్నటికి మొన్న సూళ్ళూరు పేట నుంచి మోటార్‌బైక్‌పై అత్యంత వేగంగా వెళ్తూన్న ఇద్దరు యువకులు, ఆ వేగంలోనే సెల్ఫీ తీసుకోవాలనుకుని లారీని ఢీకొట్టి ప్రాణాలు పోగొట్టు కున్నారు. కారూరి పంచాయతీలోని కారూరిమిట్ట వద్ద జాతీయరహదారిపై ఈ నెల 8న జరిగిందీ దుర్ఘటన. చెన్నై వైపు మోటార్‌బైక్‌లో వెళ్తున్న ఆ యువకులిద్దరూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోనో, వీరేంద్ర అని, వీరిద్దరూ గుమ్మిడిపూండిలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేసేవారని తెలిసింది. బైక్‌రైడింగ్ చేస్తూ.. ఆ వేగంలోనే సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నిస్తూ కిందపడి నెత్తురుమడుగులో ఉన్న వారి మృతదేహాల పరిస్థితి అత్యంత దయనీయం. అంతేకాదు, వారి చేతిలో మద్యం సీసాలు కూడా ఉన్నాయని కేసును పరిశీలిస్తున్న పోలీసులు గుర్తిం చారు. మోటార్‌బైక్‌పై అత్యంత వేగంతో.. గాలితో పోటీ పడుతున్నట్లు వెళ్తూ..మధ్యలో బైక్‌ను వంకర్లు తిప్పడం..మద్యం మత్తులో కిందామీదా అయి పోవడం..చేతులు వదిలేసి గాల్లో ఫోజులు కొట్టడం, ఇవన్నీ చాలవన్నట్లు మళ్ళీ ఆ వేగంలోనే సెల్ఫీ తీసుకోవాలని ఒకచేత్తోనే బైక్ నడుపుతూ వెనక్కి తిరిగి సెల్ఫీ తీసుకోవాలని ఆరాటపడడం... చివరికి ఏమైంది?.. రోడ్డుపక్కన ఉన్న లారీని వేగంగా ఢీ కొట్టి.. కిందపడిపోయారు. తలలు పగిలిపోయాయి.. శరీరాలు నుజ్జునుజ్జు అయిపోయాయి. కొద్దిసేపట్లోనే నెత్తుటిమడుగులో విలవిలలాడుతూ అక్కడికక్కడే మృతిచెందారు. ఎక్కడ పుట్టారో.. ఎక్కడ పెరిగారో.. ఇక్కడ నడిరోడ్ల మీద వారి జీవితాలు ఇంత ఘోరంగా కడతేరిపోయాయి. వారి తల్లిదండ్రులకు ఈ దుర్ఘటన తెలిసి ఎంతగా అల్లాడిపోయుంటారో?... సెల్ఫీ సరదాలు, విచ్చలవిడి స్నేహాలు.. మద్యలో మద్యం గుటకలు.. ఇవన్నీ కలసి యువత ప్రాణా లను రకరకాలుగా తీసేస్తున్నాయి. ఎక్కడో కొండల మీదికెక్కి సర్రున జారుతూ సెల్ఫీలు తీసుకో వాలని ప్రయత్నించడం, సాహస దృశ్యాలను సెల్ఫీల్లో బంధిం చాలనుకుని తామే ఆ సాహసాలను చేసేయడం, గాల్లో పల్టీలు కొట్టడం, సముద్రాల్లో ఈత కొడుతూ సెల్ఫీలు దిగాలని ప్రయత్నించడం.. ఇలా ఒకచోటే మిటి.. వెర్రెత్తినట్లు ప్రవర్తించేవారు కొందరైతే, సెల్ఫీ దిగుదామని అనుకుంటూ ఏ సాహసమో చేస్తూ... అజాగ్రత్తతో ప్రాణాలు పోగొట్టేకునేవారు మరికొందరు. ఎక్కడైనా సరే, మితిమీరిన ఉత్సాహం, ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం కలసి వెరసి ప్రాణాలకే ముప్పు వస్తోంది. సెల్ఫీల కోసమో..లేదా సాహసం కోసమో.. బైక్‌లపై రోడ్లమీద అత్యంత వేగంతో వెళ్తూ విన్యాసాలు చేసేవారిని చూస్తే ఎవరికైనా గుండెలు అదురుతుంటాయి. వారు ఆ స్పీడ్‌లో ఏమైపోతారో?..ఎదురుగా వచ్చేవారిని ఢీ కొని మరెంత మంది ప్రాణాలు పోగొడతారోనని హడలి చస్తుంటారు చూస్తున్న జనం. జిల్లాలో, ముఖ్యంగా నెల్లూరు నగరంలో ఆ తరహా కుర్రకారు విన్యాసాలు మరీ ఎక్కువైపోతున్నాయి.

తల్లిదండ్రులో.. అధికారులో ఎవరూ పట్టించు కోకుంటే ఇలాంటి మరణాలు మరింతగా పెరిగి పోతాయి. అలాంటి బిడ్డలను అదుపులో పెట్టుకో కుంటే.. ఆ తర్వాత ఏ ప్రమాదమో జరిగిపోయాక భోరుమని విలపించి ప్రయో జనం ఏముంటుందీ?.. అయినా, సెల్ఫీలు తీసుకోవడంలో పిల్లలు అజాగ్రత్తతో ప్రమాదాలకు లోనుకాకుండా తగు జాగ్రత్తలు చెప్పు కోవాల్సింది ముందుగా వారి తల్లిదండ్రులు.. కుటుంబసభ్యులే. రోడ్లమీదికొచ్చి బైక్‌లపై వీరంగాలు చేసేవారికి తగు పాఠం చెప్పాల్సింది మాత్రం అధికా రులే!...ఏదేమైనా ముచ్చటగా తీసుకోవాల్సిన సెల్ఫీ లను.. యువత అజాగ్రత్తతో ఇలా ప్రాణాలమీదికి తెచ్చుకోవడం బాధాకరం!..ఏ సెల్ఫీ కూడా.. పది కాలాలపాటు జ్ఞాపకంగా ఉండేలా చూసుకోవాలే గానీ, వారికి అదే చివరి సెల్ఫీ కాకూడదు. ఆ పరిస్థితి ఎవరికీ రాకూడదు. అందుకే..తస్మాత్!..జాగ్రత్త!..

# అధునాతన టెక్నాలజీ పేరుతో భారీ దోపిడీ

**- నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ ధ్వజం**



ప్రభుత్వం తలపెట్టిన ఇళ్ళ నిర్మాణ పథకంలో అంతా అవినీతి తాండవిస్తోం దని, అధునాతన టెక్నాలజీ పేరుతో దోపిడీ చేస్తున్నారని నెల్లూరు ఎమ్మెల్యే డా.అనిల్ కుమార్‌యాదవ్ తీవ్రంగా ఆరోపించారు. నెల్లూరులోని 53వ డివిజన్‌లో ఉన్న వెంక టేశ్వరపురంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, అధునాతన టెక్నాలజీ పేరుతో ఇళ్ళు నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ చెప్తున్నారని, అయితే అమరా వతిలో నిర్మించిన భవనాలు కానీ, నారా యణగారు కట్టిన ఏడంతస్తుల మేడలలో గానీ ఎక్కడైనా ఆ టెక్నాలజీని ఉపయో గించారా అని ఆయన ప్రశ్నించారు. నగరంలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లలో ఎక్కడైనా ఆ టెక్నాలజీ ఉపయోగిస్తున్నారా అని అంటూ, కేవలం పేదల పేరుతో దోపిడీ చేసేందుకు ఈ టెక్నాలజీని వాడు కుంటున్నారని ఆయన ఆరోపించారు. ఇళ్ళు మంజూరైనవారికి నెలసరి వాయిదా ఎంత కట్టాలి?. ఎంత అప్పు ఉంటుందనే సంగతి చెప్పకుండా, వారిని బెదిరించి వారి వద్ద సంతకాలు తీసుకుంటున్నది వాస్తవమా కాదా చెప్పాలన్నారు. ప్రతినెలా రెండు నుంచి మూడువేల రూపాయలు కట్టే పరిస్థితుల్లో స్థానిక ప్రజలు లేరని అన్నారు. చదరపు అడుగుకు వెయ్యి రూపాయల అయ్యే ఖర్చుకు వీరు 2,200 వసూలు చేస్తూ పేదవారిపై భారం వేసి 150 కోట్ల రూపాయలు దోపిడీ చేస్తున్న మాట వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నిం చారు. ఇళ్ళ నిర్మాణంలో జరుగుతున్న అవినీతిపై చర్చకు సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల మీద అప్పు తీసుకుని ప్రజలకు అప్పుగా ఇల్లు ఇస్తున్నారు తప్ప ఒక్క రూపాయి కూడా ప్రజలకు భారం లేకుండా ఇల్లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవర కొండ అశోక్, నాయకులు నాగరాజు, జమీర్, ఆర్.జెస్సీ, సుభాషిణి, ఖయ్యూం, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరీయులకు జాతీయ ఉత్తమ పురస్కారాలు




తిరుపతి తేజా ఛారిటీస్ ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీ చదలవాడ సుచరిత అధ్యక్షతన జాతీయ స్థాయి ఉత్తమ ఉపా ధ్యాయ పురస్కారాలను అందిం చారు. ఈ కార్యక్రమం తిరు పతిలోని చదలవాడ కృష్ణమూర్తి ఎడ్యుకేషనల్ అకాడమీ కాన్ఫ రెన్స్‌హాలులో నిర్వహించారు. నెల్లూరు కెవిఎన్ఆర్ నగర పాలక సంస్థ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబు, నెల్లూరు వెంగళ రావునగర్‌లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, తిరుపతి శాసనసభ్యులు సుగుణమ్మ, కడప ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. వీరిని శాలువాలు, పూలమాల, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

## ప్రజల్లో పోలీసులపై ఉండే...

# అపోహలు తొలగిపోవాలి

**- నెల్లూరుజిల్లా ఎస్పీ రామకృష్ణ**



ప్రజల్లో పోలీసులపై ఉండే అపోహలు తొలిగిపోవాలని, పోలీసుశాఖ ప్రతిష్ట పెంచే దిశగా చేస్తున్న కృషిలో అలసత్వం వద్దని, ఆదేశా లను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నెల్లూరుజిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరి యల్ హాల్లో జరిగిన నేరసమీక్షలో ఎస్పీ మాట్లా డుతూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగేలా వారి సమస్యలు తీరేలా పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. జిల్లాలో బెల్ట్‌షాపులు, ఇసుక, ఎర్రచందనం రవాణాలతో పాటు అక్రమ వ్యాపారాలు అరికట్టాలన్నారు. ప్రత్యేకబృందాలతో పాటు స్టేషన్ సిబ్బంది కూడా వీటిపై దృష్టి సారించాలన్నారు. జిల్లా పోలీసులు పౌర సేవలందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు పోలీసు అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని వీరి జాబితాను, వివరాలను సేకరిస్తు న్నామన్నారు. విచారణలో వాస్తవాలు బయటపడితే ఇంటికెళ్లాల్సిందేనని మందలిం చారు. అలాగే స్టేషన్ల కొచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించడంతో పాటు వెంటనే కేసు నమోదు చేసి వారికి ఎఫ్ఐఆర్ కాపీలను అందించాలన్నారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వుంటూ ప్రమాదాల నివారణకు, దొంగతనాలు, దోపిడీలను అరికట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. పోలీసుస్టేషన్‌లలో వున్న పెండింగ్ కేసులన్నీ పూర్తి చేయాలని, పెండింగ్ కేసులు వుంటే సహించేది లేదన్నారు. ఎస్సైలు కొన్ని విధివిధానాలు అలవరుచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకచర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్లో క్రైం విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని సూచించారు. ఈ సమీక్షలో డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



# ఒకరు ఇంటింటికి...

# మరొకరు గడప గడపకు..!



రాష్ట్రంలో దాదాపు ఎలక్షన్ ట్రెండ్ మొదలైందనే చెప్పొచ్చు. గట్టిగా పోరాడితేగాని వచ్చే ఎన్నికల్లో గెలవలేమనే పరిస్థితి అటు తెలుగుదేశం నాయకులకు, ఇటు వైకాపా నాయకులకు అర్థమైపోయింది. నంద్యాలలో ఓటమితో ప్రభంజనం, ప్రభుత్వ వ్యతిరేకత భ్రమల నుండి వైకాపా నాయకులు బయటకొచ్చారు. ఈ రెండింటిని మాత్రమే నమ్ముకుంటే అధికారం దక్కదనే విషయాన్ని గ్రహించారు. అదే సమయంలో నంద్యాలలో 27 వేలఓట్ల తేడాతో గెలిచామనే ఆనందం కన్నా ఇంతగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ఇన్ని వందలకోట్లు ఖర్చు చేసినా వైకాపాకు 70వేల ఓట్లు రావడం కూడా తెలుగుదేశం శ్రేణులకు మింగుడుపడడం లేదు. ఎందుకంటే ఉపఎన్నికల్లో పని చేసినట్లుగా సాధారణ ఎన్నికల్లో ప్రలోభాలు పనిచేయవనే విషయం వారికి తెలుసు.

అందుకే ఇరు పార్టీల వాళ్ళు కూడా అప్రమత్తమై నాయకులను కార్యకర్తలను జనం మీదకు, ఇళ్ల మీదకు తరిమే కార్యక్రమాలు పెట్టుకున్నారు. అధికార తెలుగుదేశం ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి శ్రీకారం చుడితే, ప్రతిపక్ష వైకాపా ఇంతకుముందు నుండే గడపగడపకు వైసిపి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

నెల్లూరుజిల్లాలో ఈ రెండు కార్యక్రమాలను తెలుగుదేశం, వైయస్సార్సీపీ నాయకులు పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పది నియోజకవర్గాలలో ఇరుపార్టీల కార్యక్రమాలలో నాయకులు పాల్గొంటున్నారు. ముఖ్యంగా వచ్చే ఎన్నికలకు టిక్కెట్ల రేసులో నిలవాలంటే ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి మార్కులు తెచ్చుకోవాల్సి వుంది. కాబట్టే నాయకులు ఈ కార్యక్రమాలలో లీనమైపోయి పని చేస్తున్నారు.





సెప్టెంబర్ 12వ తేదీన ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని గౌరవపూర్వకంగా కలిసిన 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు).

# ఐలయ్య పుస్తకాన్ని నిషేధించాలి

## - ఆర్యవైశ్యుల డిమాండ్.. భారీ ర్యాలీ



ప్రముఖ కవి కంచె ఐలయ్య రచించిన 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్ళు' అనే పుస్తకం ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, వెంటనే ఆ పుస్తకాన్ని నిషేధించి ఐలయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ నెల్లూరులో వ్యాపారులు, ఆర్యవైశ్య సంఘాల వారు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ పుస్తకంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ వ్యాపారులంతా దుకాణాలు మూసివేసి పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు మాట్లాడుతూ, ఆర్యవైశ్యులను కించపరుస్తూ కంచె ఐలయ్య రచించిన పుస్తకాన్ని నిషేధించి, ఆ రచయితను కఠినంగా శిక్షించాలని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంపి ఆంజనేయులు మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు త్యాగాలకు, దానాలకు పెట్టింది పేరని అన్నారు. అలాంటివారి పట్ల వ్యతిరేక భావాలను కలుగజేసేవిధంగా, తమను సామాజిక స్మగ్లర్లుగా చిత్రీకరించడం దారుణమన్నారు. వెంటనే ఆ పుస్తకాన్ని నిషేధించి ఐలయ్యపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాపారవర్గాల వారు పాల్గొన్నారు.

# 'సీమ'లపై ప్రత్యేక ప్రేమ

(మొదటి పేజీ తరువాయి)

వాగ్దానాలన్నీ అమలు చేయలేక సతమతమవుతున్నాడు. అయినా కూడా వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని నిలుపుకోవాలి, అందుకు ఏం చేయాలి, ఆ స్టేటజీనే చంద్రబాబు అమలు చేయబోతున్నాడు. ఏపిలో ఇప్పుడు ఎవరు అధికారంలోకి రావాలన్నా రాయలసీమ, కోనసీమ సీట్లు ముఖ్యం. 2014 ఎన్నికల్లో చంద్రబాబు రాయలసీమలో దెబ్బతిన్నా కోనసీమలో స్వీప్ చేసి అధికారంలోకి రాగలిగాడు. వచ్చే ఎన్నికల్లో కోనసీమలో మళ్ళీ అవే సీట్లు అన్నే సీట్లు వస్తాయనే నమ్మకం చంద్రబాబుకు లేదు. అందుకే రాయలసీమపై ఈసారి ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నాడు. ఎంత ప్రభుత్వ వ్యతిరేకత వున్నా, సామాజిక సమీకరణలను బట్టి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో టీడీపీదే పైచేయిగా వుంటుంది. ప్రభుత్వ వ్యతిరేకత పనిచేసినా సగం సీట్లయినా సాధించుకోవచ్చు. ఇక కృష్ణా, గుంటూరులలో సామాజిక వర్గం బలంతో పాటు అమరావతి రాజధాని ప్రభావం వుంటుంది. తెలుగుదేశాన్ని తిరిగి గెలిపించుకోకపోతే రాజధాని అభివృద్ధి ఆగిపోతుందని చెప్పి ఆ రెండు జిల్లాల ప్రజలు తమ వైపే మొగ్గు చూపుతారని తెలుగుదేశం వర్గాలు నమ్ముతున్నాయి. ఈసారి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరుజిల్లాల్లో మెజార్టీ సీట్లు రాకపోయినా సమంగా తెచ్చుకోవాలి. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, కడపలలో సీట్లు పెంచుకోవాలి. అనంతపురంలో మెజార్టీ సీట్లు వస్తాయి. కాబట్టి అధికారం నిలుపుకోవడానికి అవకాశం వుంది. 1983 నుండి ఇప్పటిదాకా 7సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ ఆరుసార్లు గెలిచిన నియోజకవర్గాలు ఒక్క ఏపిలోనే 45 దాకా వున్నాయి. అంటే అవి పార్టీకి కంచుకోటల్లాంటివి. అలాంటివాటితో పాటు పార్టీకి అనుకూలంగా వున్న మరో 50 నియోజకవర్గాలను సెలక్ట్ చేసుకుని, అక్కడ గెలుపును సునాయాసం చేసుకునే దిశగా తెలుగుదేశం నాయకులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల కడప, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీలను గెలవడం, నిన్న నంద్యాల అసెంబ్లీని గెలవడంతో ఈసారి రాయలసీమలోనూ మెజార్టీ స్థానాలు సాధించగలమనే ధీమాను టీడీపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం వీళ్ళు రాయలసీమలో బలమైన సామాజిక వర్గంగా వున్న రెడ్లను చీల్చే ప్రయత్నం చేస్తున్నారు.

ఇదే సమయంలో వైకాపా కూడా ఈసారి అధికారం సాధించాలంటే తెలుగుదేశం కోటలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ కోనసీమ, ఉత్తరాంధ్రలో దారుణంగా దెబ్బ తినబట్టే అధికారానికి దూరంగా వుండిపోయింది. ఈసారి కోనసీమ జిల్లాలైన తూర్పు, పశ్చిమ గోదావరిలలో వీలైనన్ని ఎక్కువ స్థానాలు సాధించాలి. ఉత్తరాంధ్రలో గతం కన్నా స్థానాలు పెంచుకోవాలి. ఉభయగోదావరి జిల్లాల్లో కనీసం సగం సీట్లన్నా తెచ్చుకోవాలి. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో క్రితంసారి వచ్చిన సీట్లు వస్తే చాలు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో టీడీపీకి మెజార్టీ సీట్లు వచ్చినా, రాయలసీమ జిల్లాలపై గతంలో వున్న పట్టును నిలుపుకోగలిగితే చాలు. వైకాపా అధికారానికి మార్గం సుగమం అయినట్లే!

రాష్ట్రంలో ఇక ప్రభంజనాలు, సానుభూతులు పనిచేయవు. ప్రాంతాల వారీగా, జిల్లాల వారీగా సమీకరణలు పనిచేస్తాయి. కాబట్టి ప్రతి జిల్లాకు, ప్రతి ప్రాంతానికి ప్రత్యేక ప్రణాళికతో వెళ్ళగలిగిన వాళ్లే వచ్చే ఎన్నికల్లో మొనగాళ్లవుతారు.

## రవాణాశాఖ అధికారుల సంఘంలో

# నెల్లూరు ఎంవిఐకు కీలక పదవి


రవాణాశాఖ సాంకేతిక అధికారుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నెల్లూరు జిల్లాలో ఎంవిఐగా పనిచేస్తున్న కె.సీతారామిరెడ్డి ఎన్నికయ్యారు. 10వ తేదీ విజయవాడలో జరిగిన సంఘం ఎన్నికల్లో ఆయనను ఈ పదవికి ఎన్నుకున్నారు. అలాగే జిల్లాకు చెందిన మరో ఎంవిఐ బాలమురళీకృష్ణను సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. వీరిద్దరిని జిల్లాలోని రవాణాశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

# కాంగ్రెస్‌లోనే ఉంటారా?

(మొదటి పేజీ తరువాయి)

అర్థమైపోయింది. ఒక్క సీటు రాకపోగా కనీసం పోటీ చేసిన స్థానాల్లో ఒకటి, రెండు చోట్ల తప్పితే డిపాజిట్లు కూడా దక్కలేదు. 2014 ఎన్నికలలోనే కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి తెలిసి ఆ పార్టీలో వున్న సీనియర్ నాయకులు చాలామంది తెలుగుదేశం, వైకాపాలలో చేరిపోయారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, పార్టీ పరంగా కీలకపదవుల్లో వున్న కొందరు నాయకులు మాత్రం వెంటనే కాంగ్రెస్ నుండి బయటకు రాలేకపోయారు.

కాని, నిన్న నంద్యాల, కాకినాడ ఎలక్షన్‌లు చూసాక మిగిలిన నాయకులెవరు కూడా కాంగ్రెస్‌లో ఉండే పరిస్థితి కనిపించడం లేదు. రాబోయే ఎన్నికల నాటికి మిగిలిన సీనియర్లు ఎవరు కూడా కాంగ్రెస్‌లో వుండకపోవచ్చు. కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉండవల్లి అరుణ్‌కుమార్, కెవిపి రామచంద్రరావు, పళ్లంరాజు, పనబాక లక్ష్మి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, రఘువీరారెడ్డి, చింతా మోహన్ వంటి నాయకులందరు కూడా వైకాపా లేదా టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వీరిలో ఎక్కువ మంది నాయకులు వైకాపా వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా రాష్ట్రంలో కాంగ్రెస్ దుకాణాన్ని పూర్తిగా మూసేసే రోజులు దగ్గరపడ్డాయనే చెప్పవచ్చు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com